ప్రజాశక్తి
గురువారం 1 డిసెంబర్ 2022 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

గుంటూరు కౌన్సిల్ గలభా



సమావేశంలో మేయర్, కౌన్సిలర్లు, అధికారులు

- హోర్డింగ్‌ల నిర్వహణలో అవినీతి అక్రమాలపై ధ్వజం
- పారిశుద్ధ్యం, వీధిలైట్ల నిర్వహణపై ఆగ్రహం
- రహదారుల విస్తరణలో నష్టపోయిన వారికి పరిహారం
- తాగునీటి సమస్యపై చర్చకు అనుమతి ఇవ్వని మేయర్
- నిరసనగా టిడిపి కార్పొరేటర్ శ్రీరాం ప్రసాద్ వాకౌట్
- ఒక్కటే డోర్ నంబరు కేటాయింపునకు ఆమోదం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం బుధవారం వాడీవేడిగా జరిగింది. పలు అంశాలను ప్రస్తావించిన కార్పొరేటర్లు అధికారులపై ధ్వజమెత్తారు. నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అధ్యక్షతన కలెక్టరేట్‌లోని మినీ శంకరన్ హాల్‌లో గుంటూరు నగర పాలక సంస్థ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశ మందిరం రిపేర్లలో ఉండటం వల్ల తొలిసారిగా కౌన్సిల్ సమావేశం కలెక్టరేట్‌లో జరిగింది. పారిశుధ్యం, వీధిలైట్లు, హోర్డింగ్‌లలో అవినీతి అక్రమాలు, బస్‌బేలలో అసాంఘిక కార్యకలపాలు, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అధికారులతో పలువురు కార్పొరేటర్లు వాగ్వాదానికి దిగారు. నగరంలో రోడ్ల విస్తరణలో నష్టపోతున్న వారికి నష్టపరిహారం చెల్లించడానికి కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ప్రస్తుతం నగరంలో ఎంతో కీలక సమస్యగా ఉన్న తాగునీటి సరఫరా లోపాలపై కనీసం చర్చ చేపట్టలేదు. టిడిపి కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాం ప్రసాద్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. కొన్ని రోజులుగా పశ్చిమ నియోజకవర్గంలో నీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందని, కమిషనర్‌ను కొంతమంది అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. పలుమార్లు ఈ ▶ 2లో

ఎకౌంటెంట్‌పై కేసు

ప్రజాశక్తి కథనానికి స్పందన 2వ పేజీ

2 లో



గుంటూరులో నిరసన దీక్ష చేపట్టిన యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

అణిచివేస్తే మరింత ఉధృతం

అరెస్టులకు వ్యతిరేకంగా యుటిఎఫ్ నిరసన జాగరణ దీక్ష

ధాన్యాన్ని మద్దతు ధరకు ఆర్‌బికెల్లో కొనాలి

- సిపిఎం గుంటూరు జిల్లా కమిటీ తీర్మానం
- పారిశుధ్య కార్మికుల వేతనాలు తక్షణం విడుదల చేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబురావు డిమాండ్

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న బాబురావు

ముమ్మరంగా ధాన్యం చేతికి వస్తున్న ఈ సమయంలో ఆర్‌బికెల ద్వారా కొర్రీలు పెట్టకుండా ప్రభుత్వం మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని, ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకుని నివాసముంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, టిడ్కో గృహాలను లబ్ధిదారులకు కేటాయించాలని, రాజధాని పారిశుధ్య కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని సిపిఎం గుంటూరు జిల్లా కమిటీ తీర్మానం చేసింది. బుధవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విస్తృత సమావేశం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యస్.యస్.చెంగయ్య అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్‌బాబురావు మాట్లాడారు. కేంద్రంలో బి.జె.పి అధికారంలోకి వచ్చాక నిత్యజీవితావసర సరుకుల ధరలు, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెరిగిపోయాయన్నారు. దేశంలో ▶ 2లో

తెలుగు భాషకు ఆశాకిరణం తనికెళ్ల భరణి

ప్రజాశక్తి-తెనాలి

తెలుగు భాషకు ఆశాకిరణం బహుభాషా కళాకోవిదుడు తనికెళ్ల భరణి అని ప్రముఖ సినీ నటులు సాయికుమార్ అన్నారు. స్థానిక నాజరుపేటలోని ఎన్టీఆర్ కన్వెన్షన్‌లో బుధవారం రాత్రి పట్టణానికి చెందిన తెనాలి రామలింగ కళాపీఠం ఆధ్వర్యంలో సినీ నటుడు తనికెళ్ల భరణికి ఆత్మీయ సత్కారం నిర్వహించారు. సత్కార సభకు శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ సభాధ్యక్షత వహించారు. తొలుత సభాపరిచయం మహ్మద్ షాభీర్‌షా చేయగా, సభను మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ▶ 2లో



సత్కారం పొందుతున్న తనికెళ్ల భరణి దంపతులు



గురజాడ అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గురజాడ సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వర్ధంతి సభలో వక్తల పిలుపు - ఘన నివాళులు

ప్రజాశక్తి-గుంటూరు

మహాకవి, సామాజిక తత్వవేత్త గురజాడ సాహిత్యాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని గుంటూరు రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకట సుబ్బయ్య అన్నారు. గురజాడ 107వ వర్ధంతి సభ బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో సాహితీ స్రవంతి జిల్లా బాధ్యులు బి.సుధాకిరణ్ అధ్యక్షతన ▶ 2లో



సదస్సులో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్

హింసకు తావివ్వొద్దు

ప్రజాచైతన్యం కోసం విస్తృతంగా కార్యక్రమాలు

మహిళల సంక్షేమ పథకాలన్నింటినీ ఒక చోటికి చేరుస్తాం

'లింగ వివక్షతకు ఇక ముగింపు' సదస్సులో పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

హింసకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ సమానంగా జీవించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్నారు. 'లింగ వివక్షతకు ఇక ముగింపు' అంశంపై పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్‌హాల్‌లో డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో సదస్సు బుధవారం నిర్వహించారు. ▶ 2లో



గుంటూరులో మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్, జెడ్పీ ఛైర్‌పర్సన్ తదితరులు

83614 మందికి విద్యాదీవెన

గుంటూరు, పల్నాడు జిల్లాల విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ

ప్రజాశక్తి-గుంటూరు

జగనన్న విద్యా దీవెన కింద జిల్లాలోని 40,059 మంది విద్యార్థులకు రూ.30.03 కోట్లను లబ్దిదారుల ఖాతాల్లో జమ చేశారు. జూలై-సెప్టెంబరు 2022 త్రైమాసికానికి 11.02 లక్షల మంది విద్యార్థులకు రూ.694 కోట్లను అన్నమయ్య జిల్లా మదనపల్లెలో బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో సిఎం జగన్మోహన్‌రెడ్డి జమ చేశారు. ముఖ్యమంత్రి కార్యక్రమంలో గుంటూరు కలక్టరేట్‌లోని ఎస్.ఆర్ శంకరన్ సమావేశ మందిరం నుండి కలెక్టర్ ▶ 2లో

తెలుగు భాషకు ఆశాకిరణం తనికెళ్ల భరణి

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సాయికుమార్ మాట్లాడుతూ సాహితీ ప్రపంచంలో భరణికి సాటెవరూ లేరన్నారు. తెలుగు భాష ఔన్నత్యానికి పట్టం కట్టారని, విలక్షణమైన నటుడుగా, రచయితగా ప్రఖ్యాతి గాంచిన భరణికి కళల కాణాచి లోగిలిలో సత్కారం గొప్పవిషయమని అన్నారు. భరణి చేతికి బంగారు కంకణాన్ని తొడిగి సత్కరించారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తెలుగు జాతి గర్వించదగ్గ చిత్రం మిథునం భరణి రంచించిందేనన్నారు. తెలుగు భాషకు, తెలుగు జాతికి విశేష సేవలు చేసిన ఇరవురిలో ఒకరు భరణైతే, మరొకరు సాయికుమార్ అన్నారు. తనికెళ్ల భరణి మాట్లాడుతూ తెనాలి రామలింగడు ఈ ప్రాంతంలో నడయాడటం గొప్ప విషయమని కొనియాడారు. ఎక్కడా జరగనటువంటి కార్యక్రమం ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాలు తెనాలిలో అంగరంగ వైభవంగా జరగటం కళావైభవానికి ప్రతీకని, అదే గడ్డపై తాను సత్కారం పొందటం సంతోషమని అన్నారు. అమ్మ భాష తెలుగు భాష అంతరించపోకూడదన్నారు. భాష, భావం రెండూ కలబోసిన అందం తెలుగుదనం సొంతమన్నారు. తెలుగులో పేరు కూడా రాయలేని పరిస్థితులు చూస్తుంటే భవిష్యత్ తరం ఏమైపోతుందోనన్న ఆందోళన వ్యక్తం చేశారు. సభలో సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్, అజోవిభో కందాళం అధ్యక్షులు అప్పాజోస్యుల సత్యనారాయణ, వేమూరి విజయభాస్కర్, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

83614 మందికి విద్యాదీవెన

(మొదటి పేజీ తరువాయి)

వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్యేలు షేక్ మహమ్మద్ ముస్తఫా, మద్దాలి గిరిధరరావు, సోషల్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్ గనిక ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సరిగా వినియోగించుకొని వారి భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలన్నారు. కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా వైసిపి ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్యక్రమం అనంతరం గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల విద్యార్థులకు సంబంధించిన పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మధుసుదనరావు, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రేమకుమారి పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా :జగనన్న విద్యా దీవెన నాలుగవ విడత త్రైమాసిక చెల్లింపులు కింద పల్నాడు జిల్లాలో 43,558 మంది విద్యార్థులకు రూ.31.28 కోట్లను జమ చేసినట్లు పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. సిఎం కార్యక్రమంలో స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా విద్యా శాఖాధికారి ఎం.వెంకటప్పయ్య, సంక్షేమ శాఖాధికారులు పాల్గొన్నారు.

హింసకు తావివ్వొద్దు

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమానికి డిఆర్‌డిఎ పీడీ బాలునాయక్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ సింధు నాగరికత మొదలు ఇప్పటివరకు లింగ వివక్షతకు గల కారణాలు, మహిళలపై పెరిగిపోతున్న హింసను రూపుమాపేందుకు ప్రజా చైతన్య కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నామన్నారు. లింగ వివక్షతకు చోటు లేకుండా అందరూ కృషి చేయాలని, ఇందుకు విద్య ఒక సాధనమని చెప్పారు. విద్యావ్యాప్తిలో సావిత్రిబాయి పూలే కృషిని గుర్తు చేశారు. మహిళల అభ్యున్నతి కోసం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎంతో కృషి చేశారన్నారు. మహిళల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలన్నింటినీ ఒక చోటికి చేర్చి 'బంగారు తల్లి' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని జిల్లాలో త్వరలో చేపడతామని ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధి సాధించాలంటే స్వయం సహాయక సంఘాలు బలంగా ఉండడంతో పాటు, కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగు పరిచేందుకు మహిళల సహకారం తప్పనిసరని సీఎం బలంగా నమ్ముతున్నారని చెప్పారు. తొలుత జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి స్వయం సహాయక సంఘాలు ప్రదర్శనగా సదస్సు వద్దకు చేరుకున్నారు. హింసకు వ్యతిరేకంగా గీతాలు ఆలపించారు. స్త్రీ-పురుష సమానత్వంపై ప్రతిజ్ఞ చేయడంతోపాటు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దిశా విభాగం డీఎస్పి రవిచంద్ర, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ అరుణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అణిచివేస్తే మరింత ఉద్ధృతం

అరెస్టులకు వ్యతిరేకంగా యుటిఎఫ్ నిరసన జాగరణ దీక్ష

ప్రజాశక్తి - గుంటూరు

ఉపాధ్యాయులు, ఉద్యోగుల పిఎఫ్, ఎపిజిఎల్ఐ బకాయిలు చెల్లించాలని శాంతియుతంగా ధర్నాకు పిలుపునిచ్చిన యుటిఎఫ్ నాయకుల్ని, మద్దతు పలికిన పిడిఎఫ్ ఎమ్మెల్సీలను అరెస్ట్ చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ అన్నారు. విజయవాడలో యుటిఎఫ్ నాయకులు, ఎమ్మెల్సీల అరెస్ట్‌కు నిరసనగా జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం నుండి బ్రాడీపేటలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయం ఎదుట అర్ధరాత్రి వరకూ నిరసన జాగరణ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పొదుపు చేసి దాచుకున్న డబ్బును అవసరానికి చెల్లించాలని కోరితే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించటం దారుణమన్నారు. అరెస్టులకు భయపడేది లేదని, ప్రభుత్వం ఎంత నిర్బంధం ప్రయోగిస్తే అంతే స్థాయిలో ఉద్యమం ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. బకాయిలను తక్షణమే విడుదల చేసి, ఉద్యోగుల్ని ఆదుకోవాలని కోరారు. దీక్షలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఎల్.శివపార్వతి, జిల్లా కార్యదర్శులు ఎమ్‌డి.షకీలాబేగం, జి.వెంకటేశ్వరరావు, జిల్లా అడిట్ కమిటీ సభ్యులు కె.రంగారావు, ఎం.గురుబ్రహ్మం, బి.ప్రసాదరావు, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

మంగళగిరి:స్థానిక అంబేద్కర్ సెంటర్లో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. రాష్ట్ర కౌన్సిలర్ ఎ.శ్రీనివాసరావు, తుళ్లూరు మండల ప్రధాన కార్యదర్శి టి.భాస్కరరావు, తాడేపల్లి మండల అధ్యక్షులు జి.అనంతశివ, మంగళగిరి పట్టణ అధ్యక్షులు యు.ఏడుకొండలు, నాయకులు రాధాకృష్ణ, అరుణకుమార్, రవిబాబు, బుచ్చిబాబు పాల్గొన్నారు.

కొల్లిపర: ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేదాక పోరాటాలకు వెనకాడబోమని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆదిలక్ష్మి స్పష్టం చేశారు. ఈ మేరకు యుటిఎఫ్ నాయకులు మృత్యుంజయరావు అధ్యక్షతన నిర్వహించిన మండల కౌన్సిల్ సమావేశంలో ఆదిలక్ష్మి మాట్లాడారు. బకాయిల విడుదలతోపాటు సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం యుటిఎఫ్ మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా సిహెచ్ రామకృష్ణ ప్రసాదు, అధ్యక్షులుగా సిహెచ్ శివశంకర్, సహాధ్యక్షులుగా కెవి శ్యామల, ప్రధాన కార్యదర్శిగా షేక్ కాలిషావలి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీతలైన యుటిఎఫ్ నాయకులు మృత్యుంజయ భూపతి నాయుడు, కరీమున్‌ను సన్మానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్, నాయకులు షేక్ దౌలా, జి.రజనీకాంత్, సుగుణ కుమారి, శ్రీలత, సత్తార్, షబానా, ప్రభుదాస్ పాల్గొన్నారు.



మంగళగిరి



కొల్లిపర

గుంటూరు కౌన్సిల్ గలభా

(మొదటి పేజీ తరువాయి)

అంశంపై చర్చించాలని కార్పొరేటర్ శ్రీరాం ప్రసాద్ ప్రయత్నించినా మేయర్ అంగీకరించకపోవడంతో నిరసనగా టిడిపి కార్పొరేటర్ శ్రీరాం ప్రసాద్ సమావేశం నుంచి వాకౌట్ చేశారు.

నగరపాలక సంస్థల పరిధిలో రానున్న కాలంలో రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సమావేశం ఆమోదం తెలిపింది. అనేక డోర్ నంబర్లతో సతమతమవుతున్న నగర ప్రజలకు ఒకే డోర్ నంబర్ కేటాయింపునకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

తొలుత నగరంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని పలువురు కార్పొరేటర్లు ధ్వజమెత్తారు. దీనిపై తీవ్రస్థాయిలో గలాభా జరిగింది. వాహనాలకు డీజిలు వినియోగంపై అక్రమాలు జరుగుతున్నాయని డిప్యూటీ మేయర్ బాలవజ్రబాబు ఆరోపించారు. ఈ అంశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కొండారెడ్డికి వజ్రబాబుకు వాగ్వావాదం జరిగింది. పారిశుధ్య నిర్వహణలో లోపాలను సరిదిద్దాలని మేయర్ కమిషనర్‌ను కోరారు. సమగ్ర పారిశుధ్య పనుల నిర్వహణకు కార్మికుల రేషనలైజేషన్, పనిముట్ల అందజేతకు ఆమోదం, తక్షణం అదనపు సూపర్ వైజర్ల నియామకం చేపట్టాలని నిర్ణయించారు. వార్డుల వారీగా విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల, సెక్రటరీల వివరాలను కార్పొరేటర్లకు మేయర్ కోరారు. ఇందుకు తక్షణ చర్యలు తీసుకుంటున్నట్టు కమిషనర్ తెలిపారు. చెత్త తొలగించకపోవడంతో తమ వార్డుల్లో ప్రజలు తమను ప్రశ్నిస్తున్నారని కార్పొరేటర్లు అచ్చాల వెంకటరెడ్డి, మహమూద్, రోషన్, మల్లపు రమ్య, బూసిరాజలత, ఈచంపాటి ఆచారి, పడాల సుబ్బారెడ్డి, శ్రీరాం ప్రసాద్ ఆరోపించారు. జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులను పెంచాలని కోరారు. అందుకు తగ్గట్లుగానే ఉన్నారని వీరిని పూర్తిస్థాయిలో వినియోగించాలని డిప్యూటీ మేయర్ బాలవజ్రబాబు అన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు, వీధి దీపాల నిర్వహణపైనా తీవ్ర గలభా చోటుచేసుకుంది. ఈ అంశంలో విద్యుత్‌శాఖ డిఈఈ శ్రీనివాసబాబు చేసిన వ్యాఖ్యలపై దుమారం చెలరేగింది. తాము ఎంజాయ్ చేయడానికి సమావేశానికి వచ్చారని విద్యుత్ శాఖ డిఈఈ చేసిన వ్యాఖ్యలను తప్పుపడుతూ క్షమాపణ చెప్పాలని కార్పొరేటర్లు ఈచంపాటి, అచ్చాల వెంకటరెడ్డి తదితరులు పట్టుబట్టారు. వెంటనే ఆయన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నానని, తాను ఒక పదం వాడబోయి మరో పదం వాడానని క్షమాపణ చెప్పారు. వీధి దీపాల నిర్వహణకు ఒక డిఈఈ, ఇద్దరు ఏఈలను ప్రత్యేకంగా నియమించాలని మేయర్ సూచనలను కమిషనర్ ఆమోదించారు.

హోర్డింగ్‌ల నిర్వహణలో అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని కార్పొరేటర్లు రోషన్, అచ్చాల వెంకటరెడ్డి ఆరోపించారు. ఈ అంశంపై పెద్ద ఎత్తున దుమారం చెలరేగింది. ఒక హోర్డింగ్‌కు అనుమతి తీసుకుని వంద ఏర్పాటు చేసుకుంటున్నారని, కార్పొరేషన్‌కు రూ.100 చెల్లించి రూ.లక్ష సంపాదిస్తున్నారని ఆరోపించారు. అనధికారిక హోర్డింగ్‌లపై చర్యలు లేవని దుయ్యబట్టారు. క్యూఆర్ కోడ్ విధానం ఇంకా అమలు చేయలేదన్నారు. హోర్డింగ్ ఏజెన్సీలు ఇస్తున్న సొమ్ము కార్పొరేషన్‌కు జమ అవుతుందా? లేదా? అని ప్రశ్నించారు. వారిచ్చిన చెక్కులు చెల్లుబాటు అయ్యాయా? అని నిలదీశారు. అక్రమాలను నిరోధించేందుకు క్యూఆర్ కోడ్ విధానం త్వరలో అమలు చేస్తామని కమిషనర్ కీర్తి తెలిపారు. వీరు చెల్లిస్తున్న సొమ్ముపైనా పక్కా ఆడిట్ చేయిస్తామన్నారు.

లక్ష్మీపురం బస్‌బే పై అంతస్తులో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని అచ్చాలవెంకట రెడ్డి ఆరోపించారు. ఈ బస్‌బే, కాలపరిమితి ముగిసిన బస్‌బే స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని కమిషనర్ కీర్తి తెలిపారు.

ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ క్రిస్మస్ మాసం సందర్భంగా నగరంలోని చర్చీల పరిసరాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కోరారు. అంబేద్కర్ భవన్, గుర్రం జాషువా కాన్ఫరెన్స్ హాల్స్ అభివృద్ధికి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

అనధికారిక నిర్మాణాలు జరుగుతున్నాయని, కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయం రావడంలేదని కార్పొరేటర్ పడాల సుబ్బారెడ్డి చెప్పారు. పందుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పలువురు కార్పొరేటర్లు కోరారు. ఎమ్మెల్యేలు మద్దాలిగిరి, ముస్తాఫా, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఎకౌంటెంట్‌పై కేసు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి: గుంటూరు కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు అధికారులు నిర్ధారించిన మేరకు రూ.47.09 లక్షలు స్వాహా చేసిన అంశంలో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై గత నెల రోజులుగా అధికారులు పట్టించుకోవడం లేదని ఈనెల 28వ తేదీన 'లక్షలు మింగేసినా మీనమేషాలు' శీర్షికతో ప్రచురితమైన వార్తకు కమిషనర్ స్పందించారు. పోలీసులు కోరిన వివరాలిచ్చి వెంటనే కేసు నమోదు చేయించాలని ఎగ్జామినర్‌ను ఆదేశించారు. ఈ మేరకు పూర్తి వివరాలతో ఎగ్జామినర్ జె.నాగేంద్ర కుమార్ లాలాపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ గన్నవరపు అంజయ్య కేసు నమోదు చేశారు. సెక్షన్ 408, 420, 477-ఎ ఐపిసి కింద కేసు నమోదు చేశారు. ఎకౌంట్స్ విభాగంలో పనిచేసిన ఎస్.సిరిల్‌పాల్‌ను ప్రధాన నిందితుడుగా పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదైంది. నగర పాలక సంస్థ నుంచి కాంట్రాక్టర్లకు, ఏజెన్సీలకు చెల్లించాల్సిన సొమ్మును దారి మళ్లించి స్వాహా చేయడంలో సిరిల్‌పాల్ బాధ్యుడని ఎగ్జామినర్ నాగేంద్రకుమార్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

గురజాడ సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం నిర్వహించారు. సోమేపల్లి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ నేటి ఆర్థిక, సామాజిక పరిస్థితుల నేపథ్యంలో జాషువా సాహిత్యానికి ప్రాధాన్యం ఉందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళు గడిచినా సమాజంలో కుల, మత, ప్రాంతీయ విచ్ఛిన్నకర శక్తులు ప్రబలుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. వీటికి వ్యతిరేకంగా ఉద్యమించాలని, గురజాడ స్ఫూర్తితో దేశ భక్తిని పెంపొందించుకోవాలని కోరారు. జాషువా విజ్ఞాన కేంద్రం బాధ్యులు ఎన్.భావన్నారాయణ మాట్లాడుతూ గురజాడ దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్ అనే అంశాన్ని ముందుకు తెచ్చారని, నేటి పాలకులు దేశాభివృద్ధికి కృషి చేయకపోగా మట్టితోనే సరిపెట్టుకుంటున్నారని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పాశం రామారావు, ఈమని అప్పారావు, ఎస్.ఎస్.చెంగయ్య, నళినీకాంత్, ఎం.రవి, జొన్నా శివశంకర్, బి.కోటేశ్వరి పాల్గొన్నారు. **చిలకలూరిపేట:** స్థానిక శాఖా గ్రంథాలయంలో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో గురజాడ వర్ధంతి నిర్వహించారు. సాహితీ విమర్శకులు డాక్టర్ పి.వి. సుబ్బారావు మాట్లాడుతూ సంస్కరణ దృక్పథంతో రచనలు చేసి సమాజంలో మార్పును తెచ్చిన గొప్పకవి అని కొనియాడారు. గురజాడ రాసిన 'దిద్దుబాటు' కథ తెలుగులో తొలి కథానిక అని చెప్పారు.

ధాన్యాన్ని మద్దతు ధరకు ఆర్‌బికెల్లో కొనాలి

(మొదటి పేజీ తరువాయి)

కీలకమైన ప్రభుత్వ రంగాన్ని లాభాలను ఆర్జించే సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారన్నారు. జీవిత బీమా, రైల్వేలు, టెలికం, రక్షణ రంగం, ప్రకతి వనరులను ప్రైవేటు సంస్థలకు అప్పగించారన్నారు. కీలకమైన స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తున్నారన్నారు. మరోవైపు సాధారణ ప్రజలు పేదలు, అసంఘటిత రంగ కార్మికుల ఆదాయాలు తగ్గుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం బాటలోనే పయనిస్తుందన్నారు. ప్రత్యేక హోదా విభజన చట్టంలోని హామీలు అమలు జరపని, రాజధానికి నిధులివ్వని కేంద్రంపై పోరాడకపోగా రాజీధోరణితో వ్యవహరిస్తుందన్నారు. రాజధాని ప్రాంతంలో పారిశుధ్య కార్మికులకు వేతనాలివ్వకపోవడం సిగ్గుచేటన్నారు. రాజధాని ప్రాంతంలో పారిశుధ్య కార్మికులకు 4 నెలల వేతన బకాయిలు వెంటనే ఇవ్వాలని లేనిచో ఆందోళనను ఉధృతం చేస్తామని బాబురావు హెచ్చరించారు. గత 40 రోజుల నుండి దీర్ఘకాలంగా దశల వారీగా చేస్తున్న ఆందోళనకు మద్దతు తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ వరి ధన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. ప్రత్తి, మిర్చి పంటలు తెగుళ్ల బారినపడి దెబ్బతింటున్నాయన్నారు. అధిక పెట్టుబడులు పెట్టిన రైతు, కౌలు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి, వ్యవసాయ శాస్త్రవేత్తలతో పంట పొలాలను పరిశీలించి వీటి నివారణ కోసం తగు చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.నేతాజి, ఎన్.భావన్నారాయణ, కె.నళినీకాంత్, ఎమ్.రవి, ఈమని అప్పారావు, జిల్లా నాయకులు జొన్నా శివశంకర్, జె.వి.రాఘవులు, బి.కొటేశ్వరి, కె.అజయ్‌కుమార్, బి.శ్రీనివాసరావు, ములకా శివసాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

ప్రజాశక్తి - తుళ్లూరు

స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న షేక్ అబ్దుల్ రవూఫ్ అనే వ్యక్తిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు.అతని వద్ద 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని సిఐ ఆనందరావు తెలిపారు.

నలుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - తుళ్లూరు

తుళ్లూరు నుంచి నెక్కల్లు వెళ్లే రోడ్డులో పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వారి దగ్గర నుంచి రూ.1300లు నగదు, మూడు ద్విచక్రవాహనాలు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని సిఐ ఆనందరావు తెలిపారు.



రెడ్ క్రాస్ రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణ గోళమూడి పాడులో బుధవారం నాట్కో ట్రస్ట్ ఆధ్వర్యంలో నాట్కో ఫార్మా చైర్మన్ నన్నపనేని. వెంకయ్య చౌదరి జన్మదిన సందర్భంగా రెడ్ క్రాస్ రక్తదాన శిబిరం నిర్వహిచారు.ఈ శిబిరంలో దాతలు 20 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాట్కో ట్రస్ట్ కో-ఆర్డినేటర్ కే. రమణారెడ్డి, రెడ్ క్రాస్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	31,258
మిర్చి ఎగుమతి	31,544
మిర్చి నిల్వ	11,505

మిర్చి ధరలు

	రూపాయలలో
334	10000 - 25500
నెం.5	16000 - 25500
273	18000 - 24000
341	14500 - 25000
4884	16000 - 21000
నాన్ ఎసి	
తేజ	9000 -23500
బడిగె	16000 - 27000
దేవనూరు డీలక్స్	10000 - 26000
తాలుకాయలు	4,500 - 13,500
ఎసి	
334	12200 - 25000
నెం.5	15000 -17500
341	24000 - 25500
సూపర్-10	24500 - 24500
తేజ	10000 - 21500
బడిగె	20000 - 25500
దేవనూర్ డీలక్స్	18000 - 18000
తాలుకాయలు	5,500 - 12,000

రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి

ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలోని సాగర్ రింగ్ రోడ్డు సెంటర్లో గుర్తుతెలియని వాహనం ఢీకొని బేల్దారి మేస్త్రి ఎరగాని మల్లికార్జునరావు (48) మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం రింగ్ రోడ్డు సెంటర్లో పుచ్చకాయల లోడుతో ఉన్న ట్రాక్టర్ వద్దకు వెళ్లి పుచ్చకాయ కొనేందుకు ప్రయత్నిస్తుండగా ట్రాక్టర్ కదలడంతో ప్రమాదవశాత్తు దాని కింద పడిపోయాడు. అది గమనించిన స్థానికులు వెంటనే మల్లికార్జునరావును ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు భార్య ముగ్గురు ,కుమార్తెలు ఉన్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతికి కారణమైన వాహనం కోసం పోలీసులు వెతుకుతున్నారు.

ద్విచక్ర వాహనం - ఆటో ఢీకొని..

ప్రజాశక్తి- మేడికొండూరు



దావీదు, మరియమ్మ

ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని అడ్డరోడ్డు వద్ద బుధవారం చోటు చేసుకుంది. ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం హసన్‌పురం గ్రామానికి చెందిన భార్యాభర్తలు ఇరువురు మురికిపూడి దావీదు మరియమ్మ తమ కుమార్తెతో గుంటూరుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మార్గమధ్యలో అడ్డరోడ్డు వద్ద పేరేచర్ల నుండి వెళుతున్న ప్రయాణికుల ఆటో బలంగా ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న దావీదు అతను భార్య మరియమ్మ, చిన్నారి పాపకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు వారిని వైద్య చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి ఆటోలో తరలించారు.

బాలోత్సవం ఏర్పాట్లపై సమావేశం

ప్రజాశక్తి - తాడేపల్లి

ఈ నెల 13, 14 తేదీల్లో కెఎల్.యూనివర్సిటీలో జరిగే మంగళగిరి- తాడేపల్లి బాలోత్సవం జయప్రదం చేయడానికి బుధవారం తాడేపల్లిలో ఇంజనీరింగ్ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ కె.శ్రీపతిరాయ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అమరావతి బాలోత్సవం కార్యదర్శి యువి.రామరాజు, సాంస్కృతిక రంగంలో నిష్ణాతులు గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ బాలోత్సవంలో జూనియర్స్, సబ్‌జూనియర్స్ సీనియర్స్ విభాగాల్లో 40 రకాల పోటీలు జరగనున్నాయని వెల్లడించారు. ఇవి జయప్రదం కావడానికి ఆర్గనైజర్లు, వాలంటీర్లదే ప్రధాన బాధ్యత అని చెప్పారు. బాలోత్సవం జయప్రదానికి 25మంది ఇంజనీరింగ్ విద్యార్థులు ముందుకురావడాన్ని అభినందించారు. వీరితో పాటు కార్యకర్తలు 60 నుండి 70మంది ఉంటారని తెలిపారు.



మాట్లాడుతున్న అమరావతి బాలోత్సవం కార్యదర్శి యువి.రామరాజు

హెల్ప్‌డెస్క్‌తోపాటు డాక్టర్ల బృందం కూడా అందుబాటులో ఉంటుందని చెప్పారు. పిల్లలు సెల్‌ఫోన్‌కు ఎడిక్ట్ అయిన నేపథ్యంలో బాలోత్సవాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయని బాలోత్సవాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ చెప్పారు. విద్యార్థులకు శారీరక శ్రమ లేకపోవడం, మార్కులు, ర్యాంకులు ప్రధానమైన నేటి పరిస్థితిలో వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను బయటకు తీయడానికి బాలోత్సవాలు తోడ్పడతాయని చెప్పారు. ఈ సమావేశంలో బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, కార్యదర్శులు పి.శ్రీలక్ష్మి, సింహాద్రి సుమ, అమరావతి బాలోత్సవం ఆఫీసు కార్యదర్శి ఐజక్ న్యూటన్ పాల్గొన్నారు.



ఉండవల్లిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

ఉండవల్లిలో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి - తాడేపల్లి

ఉండవల్లిలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి పర్యటించారు. వాటర్ పంప్‌హౌస్ వద్ద సౌండ్ ప్రెజర్ ఫిల్టర్స్ కోసం శుభ్రం చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఇటీవల ఆ ప్రాంతంలో వేసిన కోలాసుబ్బారావు రోడ్డు నుండి మెయిన్‌రోడ్డు వరకు అనుసంధానం అయ్యే రోడ్లను పరిశీలించారు. అవసరమున్నచోట రోడ్లకోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఈ కృష్ణారెడ్డి, ఎఈ కిశోర్‌రెడ్డి, వైసిపి నాయకులు దంటు బాలాజిరెడ్డి, బుర్రముక్కు భాస్కరరెడ్డి, కొల్లి ముసలారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎపిఎన్‌జిఒ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-గుంటూరు



ఏపీఎన్జీవో అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం బుధవారం జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల రెడ్డిని, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారిని, జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖర్‌రావుని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. ఈ సందర్భంగా వారు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులతో జరగాల్సి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని, ప్రతి మొదటి శనివారం గ్రీవెన్స్ డే రోజున జరపాలని నాయకులు కలెక్టర్‌ను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ప్రతి కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. కలెక్టర్, జెసీ, డిఆర్‌ఒలు స్పందిస్తూ ఉద్యోగుల సమస్యలు ఏవైనా తమ దృష్టికి తీసుకు వచ్చినట్లయితే సానుకూలంగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్, సహాధ్యక్షులు సిహెచ్ రాంబాబు, ఉపాధ్యక్షులు ఎస్.వెంకటరెడ్డి, డిడినాయక్, కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎన్.మూర్తి, సంయుక్త కార్యదర్శి కె.సుకుమార్, కె.శ్రీనివాసరావు, మహిళా సంయుక్త కార్యదర్శి కె.శివజ్యోతి, నగర అధ్యక్షులు ఎస్‌పిఎస్ సూరి, కార్యదర్శి కళ్యాణ్ కుమార్, జిల్లా ఉమన్ వింగ్ కన్వీనర్ లక్ష్మీరమ్య తదితరులు పాల్గొన్నారు

రూ.34 లక్షల మద్యం ధ్వంసం

ప్రజాశక్తి- పిడుగురాళ్ల

రూ.34 లక్షల విలువ చేసే తెలంగాణ మద్యంను పోలీసులు, ఎస్ఈబీ అధికారులు బుధవారం ధ్వంసం చేశారు. గురజాల డీఎస్పీ జయరాం ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం...పిడుగురాళ్ల మండలంలోని మొత్తం 194 కేసులు, 25,734 సీసాలకు గాను రూ. 33,95,556 లక్షల విలువ చేసే మద్యంను పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ ఆదేశాల మేరకు ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, సీఐ మధుసూధన్‌రావు, ఎస్ఈబీ సీఐ ఎస్. కొండారెడ్డి, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

21 వాహనాలకు వేలంపాట

ప్రజాశక్తి- పిడుగురాళ్ల

ఎస్ఈబీ పరిధిలో అక్రమంగా మద్యం తరలిస్తున్న 21 వాహనాలకు వేలంపాట నిర్వహించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ తెలిపారు. వీటి వలన రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 4.03 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ వేలంపాటలో ఎస్ఈబీ సీఐ ఎస్. కొండారెడ్డి తదితరులు ఉన్నారు.



. జైల్లో ఇబ్బందులు ఉంటే తెలియజేయండి

సబ్ జైలు తనిఖీ చేసిన న్యాయమూర్తి

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ సబ్ జైలులో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సుకు జూనియర్ సివిల్ జడ్జి ఏ.తౌషిద్ హుస్సేన్, సబ్ జైలును సందర్శించి ఖైదీలతో సమావేశం నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఖైదీల ఆరోగ్య పరిస్థితులను, భోజన సదుపాయాలు గురించి ఆరా తీశారు. జైలులో ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియ జేయాలని అడి గారు. వంట గదిని, స్టోర్ రూమ్‌ని, వండిన ఆహారాన్ని తనిఖీ చేసి తగు సూచనలు చేశారు. అనంతరం జైలు ప్రాంగణాన్ని, గార్డెన్‌ను పరిశీలించారు.



వృద్ధులకు రగ్గులు పంపిణీ

ప్రజాశక్తి-మాచర్ల

పట్టణంలో పలు ప్రాంతాలలో చలికి ఇబ్బంది పడుతున్న ఆనాథలు, వృద్ధులు, యాచకులకు దాత జి అఖిల్ ఆర్థిక సహకారంతో 30 మందికి రగ్గులు పంపణి చేసినట్లు శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్య క్షులు మెట్టు గోవిందారెడ్డి తెలిపారు.స్థానిక బస్టాండ్, రైల్వే స్టేషన్, దేవాలయాలు, చర్చిల వద్ద ఉండే యాచకులకు రగ్గులు పంపణి చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా అఖిల్‌ను అభినందించారు.



కరస్పాండెంట్ జున్నా శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా షీల్డ్ అందుకుంటున్న విద్యార్థులు

క్రమశిక్షణ విద్యతో ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

క్రమశిక్షణతో కూడిన విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని న్యూటన్ కళాశాలల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాస్ రెడ్డి అన్నారు బుధవారం మాచర్ల మండలం పలుగు రాజుపల్లి గ్రామ సమీపంలో ఉన్న న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రెషర్స్ డే సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జున్నా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడి క్రమశిక్షణ కలిగి సీనియర్స్ ను ఆదర్శంగా తీసుకొని మంచి విద్యను అభ్యసించినట్లయితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని అన్నారు ఉన్నత శిఖరాలను సాధించినట్లయితే, ఉన్నత స్థానంలో ఉండి గ్రామానికి జన్మభూమికి ఆదర్శంగా నిలిచి సేవలు చేయటానికి కూడా అవకాశం కలుగుతుందన్నారు, నూతన విద్యార్థి ప్రస్తుతం ప్రపంచ సాంకేతిక రంగంలో ముందుకు దూసుకుపోతున్న తరుణంలో నైపుణ్యానికి పదును పెట్టి మంచి విజయాల సాధించాలని అన్నారు అనంతరం ఇంతకుముందు ఉన్న సీనియర్ విద్యార్థులతో పరిచయం చేసుకున్నారు విద్యార్థులు నత్యాలు ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జగదీశ్వర్ రెడ్డి అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు

కౌన్సిల్ సమావేశం రసాబాస

ప్రజాశక్తి - చిలకలూరిపేట

చిలకలూరిపేట పురపాలక సంఘం సాధారణ కౌన్సిల్ సమావేశం సభ్యుల వాదోపవాదాలతో అట్టుడుకిపోయింది. గందరగోళం నెలకొనడంతో కౌన్సిల్ సమా వేశం రసాభాసగా మారింది. స్థానిక మైల వరపు గుండయ్య మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో బుధవారం సమావేశం జరిగింది. మున్సిపల్ చైర్మన్ రఫాని అధ్యక్షతన జరి గిన ఈ సమావేశానికి 38 వార్డులకు చెం దిన కౌన్సిలర్లు హాజరయ్యారు. అజెండాలో 51 అంశాలను చర్చకు కౌన్సిల్ సమా వేశం లో రఫాని ప్రవేశపెట్టారు. 10వ వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి మాట్లా డుతూ తమ వార్డులో జరిగిన పలు అభివృద్ధి కార్య క్రమాలు చేపట్టామని, అయితే తాము అభివృద్ధి చేయకుండా డబ్బులు డ్రా చేశామని టిడిపి కౌన్సిలర్‌లు ప్రెస్‌మీట్‌లో ఆరో పణలు చేశారని మౌలా లి ఆరోపిం చారు. ఈ విషయంపై టిడిపి కౌన్సిలర్ శ్రీనివాసరావు సమాధానంతో సభ రభస ప్రారంభమైంది. వాదోప వాదాలతో సభ లో గందరగోళం నెల కొంది. సభ్యుల మ ధ్య మాటామాటా పెరిగి 'నువ్వెంత అంటే నువ్వెంత' అనుకునే స్థాయికి చేరింది. టిడిపి కౌన్సిలర్ పాముల పాటి శివకుమారి మాట్లాడుతూ 52 ఎకరాల్లో టిడ్కో గృహా లు నిర్మించి నాలుగు ఏళ్ళు గడుస్తున్నా ఇంత వరకు లబ్ధి దారులకు ఇవ్వలేదని, ప్రజలు అద్దెలు, బ్యాంక్ లోన్లు, కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ విషయమై మున్సిపల్ రఫాని సమాధాన మిస్తూ డిసెంబర్ 15 లోపు మొదట విడ`తగా 2, 250 నివాస గృహాలు, లబ్ధిదారు లకు ఇవ్వ డానికి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నా మని, పనులు జరుగుతున్నాయని చెప్పారు. గత ప్రభుత్వం మౌలిక సదు పాయాలు కల్పించకుండా రాజకీయ లబ్ధి కోసమే గృహాలు నిర్మించి, ప్రజలను మోసం చేశారని రఫాని అన్నారు. మంత్రి విడ దల రజిని ఎంతో ముందు చూపుతో ఇళ్ల ల్లోకి వెళ్లే వారు ఎటువంటి ఇబ్బం దులు పడకూడదని అన్ని వసతులు కల్పిస్తున్నారని, ఆ పనులు వేగంగా జరుగుతున్నాయని సభకు తెలిపారు. దీంతో ప్రతిపక్ష, అధికార పక్షం నడుమ టిట్కో ఇళ్ళ గురించి తీవ్ర స్థాయిలో చర్చ జరి గింది. మాటామాటా పెరిగి, రెట్టించు కునే వరకు వెళ్లారు. ఈ క్రమంలో చైర్మన్ కౌన్సి ల్ సమావేశాన్ని ముగించారు. అజెండాలో అన్ని అంశాలను ఆమోదించారు.







క్రీడల్లోనూ రాణించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వినుకొండ

మండలంలోని చీకటీగలపాలెం గ్రామం మోడల్ స్కూల్లో బుధవారం నిర్వహించిన అండర్ 14, అండర్ 17 జిల్లా బాలుర బాల్ బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి జట్టు ఎంపిక పోటీలను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి వినుకొండ ప్రాంతానికి మం చి గుర్తింపు తీసుకురావాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధా న్యత నిస్తూ ప్రోత్సహిస్తోం దన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతో పాటు క్రీడలకు పెద్దపీట వేసిందని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శరీర దారుఢ్యానికి దోహద పడతాయని అన్నారు.

రైతులకు, విదేశీ విద్యకు విరివిగా రుణాలు

సి.జి.జి.బి రీజనల్ మేనేజర్ మారుతీ రామ్

ప్రజాశక్తి- నరసరావుపేట

తమ బ్యాంక్ ద్వారా రైతులకు,విదేశీ విద్యకు, స్వయం సహాయక సంఘాలకు, వివిధ చిన్న,భారీ పరిశ్రమలకు విరివిగా రుణాలు(బ్యాంక్ నిబంధనల మేరకు) మంజూరు చేస్తున్నామని బ్యాంక్ సేవలను ఖాతాదారులు సద్వి నియోగం చేసుకోవాలనిచైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ మారుతీరామ్ అన్నారు.రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏ1 కన్వెన్షన్‌లో బుధవారం నిర్వహించిన "జాతీయ అవగాహన కార్యక్రమానికి రీజనల్ మేనేజర్ మారుతీ రామ్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ ఏ బ్యాంక్ నుండి కూడా సిబ్బంది ఫోన్ చేసి ఖాతా వివరాలు అడగరని ముఖ్యంగా ఓ.టి. పి వివరాలు గోప్యంగా ఉంచాలని ఎవరికి చెప్పవద్దని సూచించారు. రైతుల పేరుతో నకిలీ రుణాలు తీసుకునే నేరగాళ్ల పట్ల రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం లాంటి డాక్యుమెంట్లను వాటి వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. రిజర్వు బ్యాంకు బ్యాంకు ద్వారా అనుమతించబడిన బ్యాంకులు, ఆర్థిక సంస్థల ద్వారా మాత్రమే రుణాలు తీసుకోవాలని, రిజర్వు బ్యాంకు అనుమతిలేని లోన్ యాప్‌లలో ప్రయివేటు బ్యాంకులలో రుణాలు తీసుకొని అధిక వడ్డీల వేధింపుల బారిన పడొద్దని సూచించారు.

ముఖ్య అతిథిగా హాజరైన సత్తెనపల్లి డిఎస్పి విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు ఎక్కువైపోయాయని ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలు వీటి బారిన పడుతున్నారని అటువంటి వారికి ఇటువంటి అవగాహనా కార్యక్రమాలు ఎంతో ఉప యోగపడతాయన్నారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ కామేశ్వరరావు పవర్ పాయింట్ ప్రజెం టేషన్ ద్వారా డిజిటల్ లావాదేవీలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సులభరీతిలో వివరించారు. ప్రతి ఒక్కరూ ఎటిఎం కార్డు పిన్ ను గుర్తుంచుకోవాలని, పిన్ నెంబరును కార్డుపై కానీ, ఫోన్లో కానీ నోట్ చేయవద్దని సూచించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో అవగాహన ద్వారా మాత్రమే డిజిటల్ మోసాల బారిన పడకుండా ఉంటామని, సైబర్ నేరగాళ్లను గుర్తించడం కష్టమని వాటిన బారిన పడకుండా అప్రమత్తతో పాటు జాగ్రత్తలు తీసుకొని డిజిటల్ లావా దేవీలు నిర్వహించడమే మార్గమని తెలిపారు. కార్య క్రమంలో పల్నాడు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంక టేశ్వర్లు,బాపట్ల జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పి నాయక్, గుంటూరు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఈదర రాంబాబు, ఆంధ్రప్రదేశ్ కోఆర్డినేటర్ ఈ రాజబాబు, బాపట్ల గుంటూరు పల్నాడు జిల్లాలకు చెందిన వివిధ బ్యాంకుల అధికారులు,రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, విద్యార్థులు, ఖాతాదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎస్పీ విజయ భాస్కర్ రెడ్డి



గుంటూరు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్



ప్రజాభిప్రాయ సర్వే పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, మేయర్, కమిషనర్ తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. రహదారుల విస్తరణ, మరమ్మతులు, ఇతర అభివృద్ధి పనులను సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సమన్వయంతో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో మేయరు కావటి శివ నాగ మనోహర నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి, అసిస్టెంట్ కలెక్టర్ శివ నారాయణ, శాసన సభ్యులు ముస్తఫా, మద్దాళి గిరిధర రావు తదితరులతో కలసి ఆర్ అండ్ బి, జాతీయ రహదారులు, విద్యుత్ , పోలీస్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో నగరపాలక సంస్థ మేయరు కావటి శివ నాగ మనోహర నాయుడు, శాసన సభ్యులు ముస్తఫా, మద్దాళి గిరిధర రావు మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలోని గుంతలు పడిన ఆర్అండ్‌బి రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. నందివెలుగు రోడ్డులో ఆర్వోబీ, పొన్నూరు రోడ్డు విస్తరణ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. పలకలూరు రోడ్డు అభివృద్ధి, విస్తరణ పనులు వేగవంతం చేయాలని, శంకర్ విలాస్ వద్ద ఓవర్ బ్రిడ్జ్, శ్యామల నగర్, సంజీవయ్య నగర్, నెహ్రూనగర్ వద్ద ఆర్‌యూబిల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. జాతీయ రహదారులను క్రాస్ అవుతున్న డ్రైయిన్లలో నీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని, డ్రైయిన్ల వెడల్పుకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ఇనుప విద్యుత్ స్థంబాలను, క్రిందికి జారీ ఉన్న విద్యుత్ వైర్లను, ట్రాన్స్ ఫార్మర్ల వద్ద వైర్లు సక్రమంగా ఉంచాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పొన్నూరు రోడ్డు, నందివెలుగు రోడ్డులో ఆర్‌ఓబి పెండింగ్ పనులు వెంటనే పూర్తి అయ్యేలా ఆర్ అండ్ బి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కాంట్రాక్టర్ బిల్లులు పెండింగ్‌లో రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. పలకలూరు రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులను అర్ అండ్ బి అధికారులు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులను సమన్వయం చేసుకొని వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. శంకర్ విలాస్ ఓవర్ బ్రిడ్జ్‌కు డీపీఆర్ సిద్ధం చేయటానికి చర్యలు తీసుకోవాలన్నారు. శ్యామల నగర్, నెహ్రూనగర్, సంజీవయ్యనగర్ వద్ద ఆర్ యూబి నిర్మాణాలకు రైల్వే శాఖను సమన్వయం చేసుకుంటూ వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పాడైపోయిన విద్యుత్ స్థంబాలను వెంటనే మార్చి వేయాలని, ఎక్స్ టెన్షన్ ఏరియాల్లో అవసరమైన స్థంబాలు వెంటనే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. నగరంలో ఈట్ బజార్ ఏర్పాటుకు, రహదారులపై అక్రమణల తొలగించటానికి నగరపాలక సంస్థ అధికారులకు ట్రాఫిక్ పోలీసులు సహకారం అందించాలన్నారు. తదుపరి డిసెంబరు 14వ తేదీన జరిగే సమావేశంలో పూర్తి వివరాలు అందించాలన్నారు. గుంటూరులో నెలకొన్న పరిస్థితులపై నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణ ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. డిప్యూటీ కలెక్టర్ మోవిడి వాణి, అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ జెస్సీ ప్రశాంతి, అర్ అండ్ బీ ఎస్ఈ నిర్మల, సీపీడీసీఎల్ ఎస్ఈ మురళి కృష్ణ యాదవ్, డిప్యూటీ కమిషనర్ వెంకట కృష్ణయ్య, నగరపాలక సంస్థ ఎస్ఈ భాస్కరరావు, ఈఈలు శాంతిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి విజయలక్ష్మి కన్నుమూత

భౌతికకాయానికి పలువురు నివాళి - నేడు అంత్యక్రియలు



నివాళులర్పిస్తున్న జయరాం, ఎస్.వెంకట్రావు, ఎన్.కాళిదాసు తదితరులు



విజయలక్ష్మి (ఫైల్)

ప్రజాశక్తి - తాడేపల్లి

ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు జగన్ సతీమణి, సిపిఎం సభ్యురాలు విజయలక్ష్మి బుధవారం తిరుపతిలో అనారోగ్యంతో కన్నుమూశారు. ఆమె భౌతిక కాయాన్ని గుంటూరు జిల్లా తాడేపల్లి సుందరయ్య నగర్‌కు బుధవారం రాత్రి తీసుకువచ్చారు. విజయలక్ష్మీ భౌతికకాయానికి పలువురు నాయకులు నివాళు లర్పించారు. పిఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి అనిల్, సిపిఎం నాయకులు ఎస్ వెంకట్రావు, పిఎన్ఎం పూర్వ నాయకులు నూతలపాటి కాళిదాసు విజయలక్ష్మీ భౌతికకాయంపై ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. ఆమెకు ఇద్దరు కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు రవి నవతెలంగాణా పత్రికలోనూ, చిన్న కుమారుడు తులసి ప్రజాశక్తి ప్రింటింగ్ ప్రెస్‌లోను పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఎస్ వెంకట్రావు మాట్లాడుతు విజయలక్ష్మి సుందరయ్య నగర్ లో పార్టీ సభ్యురాలుగా ప్రజల కోసం విశేషంగా పనిచేశారన్నారు. మహిళా సంఘం లో చురుకైన పాత్ర నిర్వహించారని, రాష్ట్ర గాయకుడు జగన్‌కు చేదోడు వాదోడుగా ఉంటూ ప్రజానాట్యమండలి ఉద్యమానికి సహకరించారన్నారు. విజయలక్ష్మి మృతి వార్త రాష్ట్రంలోని ప్రజానాట్యమండలి కళాకారులను, సుందరయ్య నగర్ లో పార్టీ కార్యకర్తలను విషాదంలో ముంచిందన్నారు. ఆమె మృతి వార్త తెలిసిన వెంటనే పలువురు కార్యకర్తలు లీలా సుందరయ్య కళావేదిక వద్దకు వచ్చి ఆమె భౌతికయానికి నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు డి శ్రీనివాసరావు, అప్పారావు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జయరాం, సిపిఎం నాయకులు కొట్టే కరుణాకరరావు, పి గిరిజ, కె ఉషారాణి, సుధ తదితరులు నివాళులర్పించారు.

నేడు అంత్యక్రియలు

విజయలక్ష్మీ అంతిమ యాత్ర గురువారం ఉదయం 10.30 గంటలకు తాడేపల్లి మండలం సుందరయ్య నగర్‌లో ప్రారంభమవుతుంది. విజయవాడ స్వర్గపురిలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

సిపిఎం జిల్లా కమిటీ సంతాపం

ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు జగన్ సతీమణి విజయలక్ష్మి మతికి సిపిఎం గుంటూరు జిల్లా కమిటీ ఒక ప్రకటనలో సంతాపం తెలిపింది. జగన్ ఉద్యమంలో పనిచేయటానికి విజయలక్ష్మి ఎంతో సహకరించారని, వారి మతి కుటుంబానికి తీరని లోటని పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు పేర్కొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ గందరగోళం

-అధికారుల తీరుపై భగ్గుమన్న అధికార పార్టీ కౌన్సిలర్లు

-వార్డుల్లో అభివృద్ధిలేదు... కనీసం వీధి దీపాలు వెలగని దుస్థితి అంటూ వ్యాఖ్యలు

ప్రజాశక్తి-తెనాలి:

'వార్డులో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించటం లేదు. ఎందకని? నా వార్డుపైనే వివక్ష ఎందుకు? ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవటంలేదు. నిర్లక్ష్యానికి కారణం ఏమిటి? ఈ నిర్లక్ష్యాన్ని ఇకమీదట సహించేదేలేదు.....

తాడిబోయిన రామయ్య, 25వ వార్డు కౌన్సిలర్

వీధి లైట్లు కూడా వెలగని దౌర్భాగ్యం.. కౌన్సిల్‌లో ఎన్ని సార్లు మొరపెట్టినా పట్టించుకోవటంలేదు. వార్డులో ఏ ఒక్క సమస్యా పరిష్కారానికి నోచుకోవటం లేదు. ఇంతకు ముందెన్నడూ మున్సిపాలిటీలో ఇలాంటి పిరస్థితి చూడలేదు. చేయటం చేతకాకపోతే మానుకోండి...

మొఘల్ రహ్మత్‌భేగ్, 33 వార్డు కౌన్సిలర్

అధికారులు, ప్రజాప్రతినిధులు ఏ ఒక్కరినీ వదల్లేదు. అధికార పార్టీ కౌన్సిలర్లు కౌన్సిల్ ఆరంభంలోనే మాటలయుద్ధం ప్రారంభించారు. ఏకదాటిగా ప్రశ్నల వర్షం కురింపించారు. స్వపక్షంలో విపక్షంపై చైర్‌పర్సన్, అధికారులు నివ్వెరపోయారు. చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నశీం అధ్యక్షతన సమావేశం ప్రారంభంకాగానే, సిబ్బంది అజెండా అంశాలను చదవటం ప్రారంభించారు. ఎనిమిదో అంశం చదవటం పూర్తికాగానే 25వ వార్డు కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య లేచారు. మేము కౌన్సిల్ సభ్యులం కాదా...మా వార్డులో పనులు ఎందుకు చేయటం లేదు. నిధులు ఎందుకు కేటాయించటంలేదు..ఇక ముందు ఈ పరిస్థితిన ఉపేక్షించేదే లేదు..అంటూ నిలదీశాడు. దీంతో ఒక్కసారిగా సమావేశం వేడెక్కింది. వెంటనే స్పందించిన కమిషనర్ ఎం.జస్వంతరావు సమాధానమిచ్చారు. తక్షణమే నిధులు కేటాయించి, పెండింగ్ పనులను చేపడతామని చెప్పటంతో రామయ్య సద్దుమణిగాడు. వెనువెంటనే మరో వైసిపి కౌన్సిలర్ వార్డులో సమస్యలు, పట్టణంలో సమస్యలు కౌన్సిల్ సాక్షిగా ఏకరువు పెడుతు న్నాం, పెడచెవిన పెడుతున్నారు. వార్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయరు. అన్నింటినీ మించి వీధి లైట్లు వెలగని దౌర్భాగ్య పరిస్థితి మున్సిపాలిటీలో నెలకొంది. సిగ్గు పడాలి... పనిచేయటం చేతకాకపోతే వెళ్ళిపోవచ్చంటూ ప్రశ్నించాడు. టిడిపి కౌన్సిలర్ పసుపులేటి త్రీమూర్తి , దేశు యుగంధర్ లేచి ప్రతి సమావేశం లోనూ అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నామంటున్నారు. కాని ఎక్కడా అభివృద్ధి జరగటంలేదని, కారణం చెప్పాలని నిలదీశారు. దీనిపై కమిషనర్, ఎంఈ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావటంలేదని, ఉన్నవారితోనే పనులు చేయంచటంతో జాప్యం జరగుతోందన్నారు. జాప్యాన్ని నివారించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే వారంలోగా వీధిలైట్ల సమస్యను పరిష్కరిస్తామన్నారు. అజెండా ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించటంతో సమావేశం ముగిసింది. అధికార పక్షంలో ఉన్న కౌన్సిలర్‌లు ఎదురుదాడి చేయడం కౌన్సిల్ తీరు సర్వత్ర చర్చనియాంశమయ్యింది.



కమిషనర్‌తో మాట్లాడుతున్న కౌన్సిలర్ రామయ్య



ఆలయ భూమి అన్యాక్రాంతం కాలేదు : ఈవో

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు రూరల్ మండలం గోరంట్ల రామాలయం భూమి ప్రభుత్వ రికార్డుల్లో నిషేధిత భూములు జాబితాలో ఉందని, క్రయ విక్రయాలకు అవకాశంలేదని ఆలయ ఈవో తమ్మా శివారెడ్డి తెలిపారు. బుధవారం గోరంట్ల లోని రామాలయం స్థలంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయభూమి అన్యక్రాంతం అయిందని జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని తెలిపారు. శివాలయానికి చెందిన భూమి ఎవరి ఆక్రమణలో లేదని ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా తాను వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. 92.50 సెంట్లు భూమి ద్వారా వస్తున్న అద్దెల ద్వారా ఆలయ నిర్వహణకు వినియోగిస్తున్నామని తెలిపారు. 2014 నుంచిఈ భూమి నిషేధిత జాబితాలోనే ఉందని ఎటువంటి క్రయ విక్రయాలు జరగలేదన్నారు. రాజకీయ కారణాలతో రామకృష్ణ అనే వ్యక్తి జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారని ఈమేరకు వాస్తవ పరిస్థితులు కలెక్టర్‌కు నివేదిక ఇస్తామన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎర్రం శెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ స్థలం పై కొందరు పని కట్టుకొని అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని అన్నారు. వ్యక్తిగతంగా, రాజకీయంగా తనను దెబ్బతీసేందుకు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని అన్నారు. గోరంట్లలో తాను 9 ఆలయాలకు నిర్వహణ చేస్తున్నానని, దూపదీప నైవేద్యాలు, అర్చకుల జీతాలు, విద్యుత్ బిల్లులు చెల్లిస్తూ నిర్వహణ ఖర్చులు భరిస్తున్నానని తెలిపారు. తనపై అసత్య ప్రచారం చేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎర్రం శెట్టి సూరి ,బొల్లిపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



కాకుమాను పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ

అధికారులకు పలు సూచనలుచేసిన ఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కాకుమాను పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పి ఆరిఫ్ హఫీజ్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులపై దృష్టి సారించి, కేసుల దర్యాప్తు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

పోలీస్ స్టేషన్ పరిసరాలను, మరియు స్టేషన్ లాకప్, కంప్యూటర్ రూం, ఇతర విషయాలను స్థానిక ఎస్సైను అడిగి తెలుసుకున్నారు. సిఐ సుబ్బారావు, ఎస్ఐ రవీంద్రకు పలు సూచనలు చేశారు. గ్రామాల నుంచి ఫిర్యాదులు వస్తుంటాయని, ప్రతి ఫిర్యాదులను పరిశీలించి తగిన విధంగా చర్యలు తీసుకోవాలని, తప్పకుండా రిసెప్షన్ రిజిస్ట్రార్ లో వ్రాయడం, రశీదు ఇవ్వడం, పోలీసు స్టేషన్ లో న్యాయం జరుగుతుందని అనే నమ్మకం కలిగించాలని స్టేషన్ యస్ ఐ కు సూచించారు. కాకుమాను మండలంలోని గ్రామాలలో ఇన్ఫార్మర్ల ద్వారా ముందస్తు సమాచారం తెలుసుకొని, ఆయా గ్రామాలలో ఎద్దైనా సంఘటన జరిగితే వెంటనే చర్యలు తీసుకునే విధంగా అప్రమత్తంగా ఉండాలని భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రతిరోజు రౌడీషీటర్ల, సస్పెక్ట్ కలిగిన వారిపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకొని వారి కదలికలపై నిఘా ఉంచాలని, రాత్రి సమయంలో నైట్ బీట్ డ్యూటీ చేస్తున్న సిబ్బంది మండల పరిధిలో ఉన్న గ్రామాలలో ముందస్తు సమాచారం తెలుసుకొని శాంతి భద్రతలను అదుపులో ఉండేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సైను ఆదేశించారు. స్పెషల్ బ్రాంచ్ సి ఐ నరసింహా రావు తదితరులు పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనులు వేగవంతం చేయండి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మా బడి నాడు- నేడు పనుల పురోగతిలో వెనుకబడిన మండలాలు వేగంగా పురోగతి సాధించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలోని ఎస్. ఆర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, మున్సిపల్ కమిషనర్లతో నాడు-నేడు పనుల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు మెడికల్ లీవ్‌లో వెళ్ళిన వారు ఉంటే వారి స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి నాడు- నేడు పనుల్లో ఆటంకం కలగకుండా చూడాలన్నారు. కొన్ని పాఠ శాలల ప్రాంగణాలలో శిథిలావస్థలో ఉన్న భవనాలను కూల్చివేసి ఆ స్థలాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాను కూల దృక్పథంతో సమిష్టి కృషితో అందరూ పనిచేయాలని, అవసరమైన చోట పనుల రద్దుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని సూచించారు. సిమెంటు కొరత లేకుండా చూసే విధంగా సంబంధిత కంపెనీల యాజమాన్యంతో చర్చించాలని, లిఖితపూర్వ కంగా కూడా కోరాలని పరిశ్రమల శాఖాధికారిని ఆదేశం చారు. త్వరలో స్కూల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ సిస్టమును ప్రారంభించనున్నామని, ఆయా పాఠశాలలలో ఉపా ధ్యాయుల బోధన అంశాలపై టీముల వారీగా వెళ్లి పరిశీలించనున్నట్లు చెప్పారు. పరిశీలన నివేదిక అనుసరించి ఉపాధ్యాయుల ప్రావీణ్యతను గుర్తించడం, వెనుక బడిన ఉపాధ్యాయులకు వేసవికాలం సెలవులలో శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగు తుందన్నారు. ఈ సందర్భంగా బైజుస్ యాప్ వినియోగంపై స్పందనను అడిగి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయులు లాగిన్లలో ఇంకా ఎస్.ఎం.ఎఫ్ అకౌంట్లను త్వరితగతిని తెరవాలని ఆదేశించారు. రివాల్వింగ్ ఫండ్‌ను త్వరితగతిన ఖర్చు చేయాలని సూచించారు. పనులు చేపట్టని పాఠశాలలలో ఉన్న నిధులను ఆయా మండలాలలో బెస్ట్ పెర్ఫార్మన్స్ కన పరిచిన పాఠశాలలకు బదలాయింపు చేసి, పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి బాలు నాయక్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వెంక టేశ్వర్లు, ఎస్ఎస్ ఏ అధికారి విజయకుమార్ వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి- పిడుగురాళ్ల

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సాదాసీదాగా సాగిపోయింది. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు ఎజెండాలోని అంశాలను చదివి వినిపించారు. కౌన్సిల్ సభ్యులంతా ఏజెండాలోని అంశాలను మొత్తం ఆమోదించారు. కౌన్సిలర్‌లు వారి వార్డులలో ఉన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొని వచ్చారు. వాటిని పరిష్కరించే విధగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు సూచించారు. సమావేశ మందిరంలో మొత్తం 20 మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరయ్యారు. వీరిలో కొంత మంది సమావేశం జరుగుతుండగానే వెళ్లపోవటం, మిగిలిన వారితో సమావేశం తూతూ మంత్రంగా జరిపించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్‌లు కొమ్ము ముక్కంటి, షేక్ జైలాబ్దిన్, మున్సిపల్ డీఈ సత్యనారాయణ, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను లిఖితపూర్వకంగా సేకరించాలి

ప్రజాశక్తి - వినుకొండ

వైసిపి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలు, అవినీతి, దౌర్జన్యాలు, దుర్మార్గాలు, వైఫల్యాలను 'ఇదేమి కర్మ ఈ రాష్ట్రానికి' కార్యక్రమం ద్వారా ఇంటింటికి వివరించి చెప్పాలని పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. బుధవారం స్థానిక గంగినేని ఫం క్షన్ హాల్‌లో ఆర్‌టిఎస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. జీవి ఆంజనేయులు, రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు గుట్టుపల్లి శ్రీదేవి, నియోజకవర్గ పరిశీలకులు మానుకొండ శివప్రసాద్‌రావు ముఖ్య అతిథులుగా హాజరై టిడిపి శ్రేణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 2 నుండి 'ఇదేమి కర్మ ఈ రాష్ట్రానికి' కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. జగన్ రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చెప్పారు. రాష్ట్ర టిడిపి కార్యదర్శి షమీం ఖాన్, ఎం.సుబ్బారావు, పి. నాగేశ్వరరావు, బి.వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి మానవత్వం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

టిడిపి నేత, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మానవత్వం చాటుకున్నారు. బుధవారం గుంటూరు వెళ్తుండగా నియోకవర్గపరిధిలోని తుమ్మలపాలెం గ్రామ శివారు లో జరిగిన బస్సు ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థిని హాస్ప టల్‌కు తరలించే వరకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు.. యడ్లపాడుకు చెందిన విద్యార్థి మిట్లపల్లి కాలేజిలో విద్యనభ్యసిస్తున్నాడు. బుధవారం ఉదయం నేషనల్ హైవేపై వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును బైక్ పై వెళుతున్న అతను వెనుక నుంచి ఢీ కొట్టాడు. దీంతో, తీవ్రంగా గాయపడ్డాడు. అదే సమ యంలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు పర్యటన కోసం వెళుతున్న ప్రత్తిపాటి పుల్లారావు, ఈ ప్రమా దాన్ని చూసి వెంటనే స్పందించారు. అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ రావడం ఆలస్యం కావ డంతో అదే బస్సులో ఆ విద్యార్థిని గుంటూరు కే.ఎం.సి. ఆస్పత్రికి తరలించారు. వైద్యులతో మాట్లాడిన ప్రత్తిపాటి, గాయపడ్డ విద్యార్థికి మెరుగైన చికిత్స అందిలంచాలని కోరారు.

ఉపాధ్యాయులను మినహాయించండి

యుటిఎఫ్ పల్నాడు జిల్లా కమిటీ

ప్రజాశక్తి-నరసరావుపేట: దశాబ్దాలకు పైగా దేశ వ్యాప్తంగా పదేళ్లకు ఒకసారి జనాభా గణన, ఐదేళ్లకు ఒకసారి సార్వత్రిక ఎన్నికల విధులలో ఉపాధ్యాయులు పాల్గొనడం జరుగుతుందని, అయితే రాష్ట్ర ప్రభుత్వం ఉపా ధ్యా యులను ఆ రెండు బోధనేతర విధుల నుండి ఉపాధ్యాయులను మిన హాయిస్తూ క్యాబినెట్ మీటింగ్ ద్వారా ఉత్తర్వులు ఆమోదించడం గమనార్హమని యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కార్యదర్శులు పి.ప్రేమ్ కుమార్, జి. విజయసారధిలు బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. బోధ నేతర పనులలో భాగంగా కోడి గుడ్లు, చిక్కిల లెక్కలు, మధ్యాహ్నం భోజనం తయారు చేసిన పదార్థాలను, మరుగుదొడ్లను ఫోటోలు తీసి యాప్‌లో నమోదు చేయడంతో పాటు విద్యా ర్థుల బూట్లు , కొలతలు, యూనిఫామ్, పుస్త కాలు సకాలంలో అందక పుస్తకాలు ఇచ్చిన ప్రతి సారి తల్లి దండ్రుల బయోమెట్రిక్ ను జగ నన్న విద్యా కానుక యాప్‌లో ఫోటోలు నమోదు చేయడం, నాడు-నేడు పనుల నిర్వహణ ఫోటోలు అప్లోడ్ చేయడం మొదలు విద్యే తర, బోధనేతర పనుల నుండి కూడా ఉపాధ్యాయులను మినహాయించాలని డిమాండ్ చేశా రు. ఈ పనులన్నీ నిర్వహించేందుకు గ్రామపంచాయతి స్థాయిలో ఒక ప్రత్యేక ఉద్యోగిని కేటా యించాలని విజ్ఞప్తి చేశారు. ప్రకటన జారీ చేసిన వారిలో జిల్లా గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాస్ రెడ్డి, సహాధ్యక్షులు ఎన్.సుందరరావు, ఎ.భాగేశ్వరీ దేవి, కోశాధికారి జె.వాల్యా నాయక్ ఉన్నారు.

విద్యార్థుల సంక్షేమాన్ని గాలికొదిలేసింది

ప్రజాశక్తి - చిలకలూరిపేట: రాష్ట్ర ప్రభుత్వం వసతిగృహాలపై కంటి తుడుపుగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తోందని, విద్యార్థుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని ఏ.పి గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి. శ్రీను నాయక్ అన్నారు. బుధవారం ఎన్నార్టీ సెంటర్‌లోని సంఘం కార్యాలయంలో పాత్రికేయులతో ఆయన మాట్లాడారు.

రాష్ట్ర ప్రజానీకానికి ఇదేం కర్మ: మాజీ ఎమ్మెల్యే వైవీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్



తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని గుడిపూడిలో 'ఇదేం కర్మ ఈ రాష్ట్రానికి' కార్యక్రమాన్ని మాజీ శాసనసభ్యులు వైవి ఆంజనేయులు లాంఛనంగా ప్రారంభించారు. వైవి ఆంజనేయులు మాట్లాడుతూ వైసిపి అరాచక పాలనకు ముగింపు పలకాలన్నారు. ముందుగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ అసమర్థ పాలన గురించి వివరించారు. కార్యక్రమంలోరాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ సాంబయ్య, నూతన సత్తెనపల్లి మండల పార్టీ అధ్యక్షులు ఆళ్ళ అమరేశ్వరావు, సత్తెనపల్లి పట్టణ పార్టీ అధ్యక్షులు కటకం రామకృష్ణ, ముప్పాళ్ళ మండల పార్టీ అధ్యక్షులు బత్తుల నాగేశ్వరరావు,రాజుపాలెం మండలం టి డి పి అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు, క్లస్టర్ బాధ్యులు, గుడిపూడి గ్రామ పార్టీ అధ్యక్షులు గద్దె అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన సిఆర్‌పి

ప్రజాశక్తి-అమరావతి: మండల పరిధిలోని జూపూడి మండల పరిషత్ ప్రాథమిక (బి.సి)పాఠశాలను నెల వారి పర్యవేక్షణలో భాగంగా సిఆర్‌పి నండూరి శోభారాణి బుధవారం సందర్శించారు. తర్ల్ లెర్నింగ్ లెవల్స్, బేస్లైన్ పరీక్షలు ఎఫ్,ఎ1 పరీక్షల నిర్వహణ, నమోదు, విద్యార్థుల అభ్యసన స్థాయి, ప్రగతి తదితర అంశాలను పరిశీలించారు.

రేపు సాగర్ జలాశయంలో చేప పిల్లలు విడుదల

ప్రజాశక్తి-విజయపురిసౌత్: ఈ నెల 2న ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా నాలుగు లక్షల చేప పిల్లలను విజ యపురిసౌత్‌లోని లాంచ్ స్టేషన్ వద్ద నాగార్జునసాగర్ జలా శయంలోకి విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని ఎఫ్.డి.ఓ రఘుకిషోర్ రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మత్స్య శాఖ ద్వారా మిషన్ ఫింగర్లింగ్ పథకం 2022-23 లో భాగంగా జలాశయంలోకి చేప పిల్లలను విడుదల చేయనున్నట్లు చెప్పారు. చేప పిల్లల విడు దల మత్స్యకారుల ప్రగతి, వారి జీవనోపాధికి దోహదపడుతుందన్నారు. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు సాగర్ మహోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు.

'విద్యా జ్యోతి' స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - చిలకలూరిపేట: స్థానిక శ్రీ మద్ది కామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పసుమర్రులో జగనన్న విద్యా జ్యోతిస్టడీ మెటీరియల్‌ను 10వ తరగతి విద్యార్థినీవిద్యార్థులకు బుధవారం పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయులు షేక్ మొహమ్మద్ యాసిన్ ఒక ప్రకటనలో తెలిపారు. **విజయపురిసౌత్:** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం ఆల్ ఇన్ వన్ మెటీరియల్ బుక్ ను విద్యార్థులకు అందజేశారు. ఇన్‌ఛార్జి హెచ్ఎం లక్ష్మీ మాట్లాడుతూ అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకే ప్రభుత్వం విద్యాజ్యోతి పథకంను ప్రవేశపెట్టిందని అన్నారు. **మాచవరం:** మండలంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో టెన్త్ క్లాస్ పిల్లలకు జగనన్న విద్యా జ్యోతి స్టడీ మెటీరియల్‌ను జడ్పిటిసి సభ్యులు జె శివ యాదవ్, ముఖ్యఅతిథి పొన్నూరు మండల జడ్పిటిసి సభ్యులు కర్లపూడి రమేష్ పంపిణీ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా చైర్ పర్సన్ హెనిక్రిస్టియనా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. **మాచర్ల:** స్థానిక జిల్లా పరిషత్ బాలికల, బాలుర పాఠశాలల హెచ్.ఎంలు పోలా ఉషారాణి, షేక్ పాహిమ్‌ల అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జగనన్న విద్యా జ్యోతి స్టడీ మెటిరియల్‌ను విద్యార్థులకు ఉచితంగా పంపిణి చేశారు. జడ్‌పిటిసి మల్లుస్వామి అన్నారు. **ఈపూరు:** మండల కేంద్రమైన ఈపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టడీ మెటీరియల్‌ను జడ్పిటిసి తుర్లపాటి చౌడయ్య పంపిణీ చేశారు.

భూ రీసర్వేకు రైతులు సహకరించాలి

ప్రజాశక్తి-ఈపూరు: భూములు కలిగిన రైతులందరూ భూ రీ సర్వేకు సహకరించాలని నరసరావుపేట ఆర్డిఓ ఎం శేషిరెడ్డి రైతులను కోరారు.మండలంలోని ఈపూరు,బొమ్మరాజు పల్లి,గుండెపల్లి గ్రామాలలో జరుగుతున్న భూరి సర్వేను ఆయన బుధవారం పరిశీలించారు. బొమ్మరాజుపల్లి లో క్షేత్రస్థాయిలో భూ రికార్డులను పరిశీలించి రెవిన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలోని అన్ని గ్రామాలలో భూరి సర్వేను ప్రారంభించాలన్నారు. అనంతరం గుండెపల్లిలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ 2023 డిసెంబర్ నాటికి భూ రీ సర్వేను పూర్తి చేసి రైతులందరికీ భూహక్కు పత్రాలను అంద జేయడం లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.**రొంపిచర్ల:**మండల కేంద్రమైన రొంపిచర్లలో జరుగుతున్న రీ సర్వే పనులను తహశీల్దార్ జె.శ్రీని వాసరావు పరిశీలించారు. పొలాలను సర్వే చేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. **చిలకలూరిపేట:** మండల పరిధిలోని కుక్కపల్లివారిపాలెంలోని రైతులకు 9(2) నోటీసులు ఇచ్చినట్లు మండల తహశీల్దార్ జి.సుజాత తెలిపారు.

సమాజంలో అందరూ సమానమే

ప్రజాశక్తి-ముప్పాళ్ల: సమాజంలో అందరూ సమానమేనని, అది రాజ్యాంగం మనకు కలిపించిన హక్కు అనీ తహశీల్దార్ భవానీ శంకర్ అన్నారు. మండలంలోని నార్నెపాడులో బుధవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ .ఒక వ్యక్తి హక్కును హరించడం చట్టరీత్యా నేరమన్నారు. సర్పంచ్ పోలూరి యల్లమంద పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం : మంత్రి అంబటి

ప్రజాశక్తి -సత్తెనపల్లి టౌన్



ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర మంత్రి అం బటి రాంబాబు అన్నారు . బుధవారం ఆయన పట్టణంలోని 13 వ వార్డులో గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రూ.20 లక్షలతో వార్డులో అభివృద్ధి పనులు చేయాలని అధి కారులకు సూచించారు.

మాటకు కట్టుబడ్డ నాయకుడినే ఎన్నుకోండి

ప్రజాశక్తి-బెల్లంకొండ: ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే సత్తా ఉన్న నాయకులను ప్రజలే ఎంచుకోవాలని పెద కూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. బుధవారం బెల్లంకొండ కేంద్రంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రధాన రహ దారుల న్నింటిని త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. ఇచ్చిన మాట కు కట్టుబడి, నిలబడి ఉన్న వారిని, అభివృద్ధి చేసే సత్తా ఉన్న నాయకుడినే మళ్లీ తిరిగి ఎన్నుకోవాలని ప్రజలను కోరారు.

నూతన జెసిబిని ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- అమరావతి: అమరావతి మండల పరిధిలోని ధరణికోట వైసిపి సర్పంచ్ మాదాసు పావని రాంబాబు నూత నంగా కొనుగోలు చేసిన జెసిబి వాహ నానికి బుధవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రారంభించారు.



మురుగు నీరు వెళ్లేందుకు కాలువ ఏర్పాటు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -నాదెండ్ల



ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి ఎట్టకేలకు స్పందన లభించింది. మండలంలోని సాతులూరులో పాల కేంద్రం నుండి సినిమా హాల్ సెంటర్ వెళ్లే ప్రధాన రహదారిలో గత ఏడాది నుండి మురుగునీరు ప్రవహిస్తున్నా పట్టించుకో లేదంటూ వార్త వచ్చిన నేపథ్యంలో అధికారులు శాశ్వత పరిష్కారం ఏర్పాటు చేశారు. ఆ రహదారి పక్కన మురుగు నీరు వెళ్లేందుకు కాలువ లేకపోవడంతో సిమెంట్ కాలువను ఏర్పాటు చేశారు. ఆ మార్గంలో ప్రయాణించే విద్యార్థులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



స్వామినాయుడును సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ

కళాకారుడు స్వామినాయుడుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఎన్‌టిఆర్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణానికి చెందిన సీనియర్ కళాకారుడు గొట్టిపాటి స్వామినాయుడును సత్కరించారు. స్థానిక బోస్‌రోడ్డులోని పెమ్మసాని థియేటర్‌లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారధ్యంలో నిర్వహిస్తున్న ఎన్‌టిఆర్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎన్‌టిఆర్ నటించిన వారసత్వం చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో కావూరి సాంబశివుడు, సుంకర శ్రీనివాసరావు, బల్లి వసంతరావు, ఎన్.శ్రీనివాసరావు, డాక్టర్ అయనాల మల్లేశ్వరరావు, డి.భవాని, ఎం.రాఘవరావు, పి.పోతురాజు పాల్గొన్నారు.

హుండీల లెక్కింపు

ప్రజాశక్తి -మంగళగిరి

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఎగువ దిగువ సన్నిధి, ఉపాలయాల హుండీల లెక్కింపు బుధవారం దేవస్థానం దిగువ సన్నిధిలో జరిగింది. రూ. 20,63,870 ఆదాయం వచ్చింది. 17 గ్రాములు బంగారం, 375 గ్రాములు వెండి, అమెరికన్ డాలర్ ఒకటి వచ్చినట్లుగా దేవస్థానం ఈఓ ఏ. రామకోటి రెడ్డి తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న నారాలోకేష్

మూడు రాజధానుల పేరుతో కాలయాపన

ప్రజాశక్తి - తాడేపల్లి

మూడు రాజధానుల పేరుతో సిఎం జగన్మోహనరెడ్డి కాలయాపన చేస్తూ ప్రజల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. తాడేపల్లి పట్టణంలోని సీతానగరంలో బుధవారం సాయంత్రం ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ప్రజావేదిక కూల్చడంతో మొదలైన జగన్ సర్కార్ నేడు ప్రజల ఇల్లు కూలుస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాను వచ్చిన నెలరోజుల్లోనే సిపిఎస్ రద్దుచేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి ఉపాధ్యాయులపై నిర్భంధ కాండను ప్రయోగించడం సిగ్గుచేటని అన్నారు. మద్యపాన నిషేధం ఎత్తేస్తామని పంగనామాలు పెట్టారని ఎద్దేవా చేశారు. తాడేపల్లి పట్టణంలో మూడురోజులకోసారి మంచినీళ్ళు వచ్చే ఏరియాలు ఉన్నాయంటే ఆశ్చర్యం కలుగుతుందన్నారు. తనను గెలిపిస్తే సమస్యలన్నీ పరిష్కారం చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

భట్రాజు వర్గ కన్వీనర్‌గా రమాదేవి

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన సరికొండ రమావేవి టిడిపి తెనాలి నియోజకవర్గ సాధికార సమితి భట్రాజువర్గ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా స్థానిక కొత్త పేటలోని పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారధ్యంలో ఆమెను అభినందించారు. పార్టీలో నామినేటెడ్ కమిటీల్లో తనకు ప్రాధాన్యత కల్పించటం పట్ల రమాదేవి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టి.హరిప్రసాద్, మహ్మద్ ఖుద్దూస్, ఈదర వెంకటపూర్ణచంద్, ఏ. జయలక్ష్మి, ఎస్.నాగేశ్వరరావు, ఎల్ గంగరాజు, బి.సత్య నారాయణ, కె.కొండంరాజు, ఎస్.చినసాంశివరాజు పాల్గొన్నారు.

విచారణ పేరుతో రైతులకు రుణాలు ఆపడం తగదు



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు వెంకట శివరావు

ప్రజాశక్తి- పెదనందిపాడు రూరల్

ఎంక్వైయిరీ పేరుతో రైతులకు రుణాలు అపడం తగదని, అర్హులైన రైతులందరికీ పంట రుణాలు ఇవ్వాలని రైతు సంఘం నాయకులు కె. వెంకటశివరావు డిమాండ్ చేశారు. బుధవారం పెదనందిపాడు, కాకుమాను సొసైటీలను రైతు సంఘం ఆధ్వర్యంలో సందర్శించిన అనంతరం వారు మాట్లాడుతూ పెదనందిపాడు, కాకుమాను సొసైటీలకు సంబంధించి న 50 మంది రైతులకు అన్ని అర్హతలున్నా పంట రుణాలు గత ఏడాది నవంబర్ నెల నుంచి ఇంతవరకు అందించలేదని, రుణాల కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. ఆ సొసైటీలలో అక్రమాలు జరిగితే, ఎంక్వైరీ పేరుతో రైతులకు లోన్లు ఆపడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. జిడిసిసి బ్యాంకు అధికారులు రైతు సంఘం నాయకులతో మాట్లాడుతూ ఎంక్వయిరీ జరుగుతున్న బ్యాంకుల పరిధిలో లోన్లను ఆపమని, జిల్లా హెడ్ ఆఫీస్ నుంచి సర్కులర్ వచ్చిందని అందువల్ల లోన్లు ఇవ్వలేకపోతున్నామని తెలిపారు. ఈ సమస్యను పరిష్కారానికై రుణ అర్హత కలిగిన రైతులందరికీ రుణాలు అందజేయాలని కోరుతూ గురువారం గుంటూరు జిడిసిసి బ్యాంకు మేనేజర్, చైర్మన్‌ను కలిసి మాట్లాడి వినతిపత్రం అందజేస్తామని రైతు సోదరులందరూ గుంటూరుకు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కాకుమాను నాగేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త శివ నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు చుక్కా యానాదులు, పోతినేని వేణు, కాకుమాను చెన్నయ్య, కంచర్ల శ్రీరామ్మూర్తి పలువురు రైతులు పాల్గొన్నారు.

మహిళలపై వివక్ష తగదు



మాట్లాడుతున్న ఎపిఎం సుబ్బారావు

ప్రజాశక్తి-పెదనందిపాడు

మహిళలపై వివక్ష తగదని పని ప్రదేశాలలో, గృహాల్లో వారిపై వివక్ష చూపరాదని పెదనందిపాడు మండల ఏపిఎం ఎం.సుబ్బారావు అన్నారు. బుధవారం పెదనందిపాడు సచివాలయం-2 నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. మహిళలపై ఇంటిలో వివక్ష, పని ప్రదేశంలో వివక్ష, వృత్తి వివక్షత, లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013, ఫిర్యాదు చేసే విధానాలు గురించి, ఇందులో ఎస్‌హెచ్‌జి సమైక్య పాత్ర, బాధ్యతలపై ప్రభుత్వ విభాగాలు, ఎన్జీవోస్, సిబ్బందితో కలసి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ప్రతినిధులు అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సదస్సులో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎస్ కె. జీరాబి, భారతి ,మహిళా పోలీస్ మానస, హెచ్‌డి వి సుబ్బారావు, విఓఏలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - తాడేపల్లి

విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 1.30 వరకు కృష్ణాకరకట్ట, విజయవాడ క్లబ్‌రోడ్డు, ఆశ్రమం రోడ్డు, ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని డిఈ ఎ.సత్యనారాయణ, ఎఈ నాగమల్లేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.



తహశీల్దార్‌ను సత్కరిస్తున్న సొసైటీ సభ్యులు

తహశీల్దార్ రాంప్రసాద్‌కు సత్కారం

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంగళగిరి సబ్ బ్రాంచ్ ప్రెసిడెంట్ మంగళగిరి తహశీల్దార్ జివి. రాంప్రసాద్ చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచంధన్ బంగారు పతకాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా మంగళగిరి శాఖ ఆధ్వర్యంలో చినకాకానిలోని ఓ హొటలలో బుధవారం తహశీల్దార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి మంగళగిరి రెడ్ క్రాస్ చైర్మన్ అనిల్ చక్రవర్తి అధ్యక్షత వహించారు.ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ గుంటూరు బ్రాంచ్ వైస్ చైర్మన్ రామచంద్ర రాజు, రోటరీ డిస్ట్రిక్ట్ ట్రైనర్ రత్న ప్రభాకర్ మంగళగిరి అధ్యక్షులు టి సతీష్ బాబు మాట్లాడుతూ, తహశీల్దార్ రాంప్రసాద్ కోవిడ్-19 ఇన్సిడెంట్ కమాండర్‌గా రెడ్ క్రాస్ సొసైటీ గౌరవ అధ్యక్షులుగా చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు సభ్యులు గాజుల శ్రీనివాసరావు, డాక్టర్ మాజేటి వంశీకృష్ణ, ఇంజమూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సరుకులు అందజేస్తున్న కట్టెపోగు ఉదయ భాస్కర్

పేద కుటుంబానికి నిత్యావసర సరుకులు

ప్రజాశక్తి- మంగళగిరి రూరల్

నగరంలోని నవులూరు మక్కేవారి పేటకు చెందిన కస్తూరి మేరి అనే నిరుపేద కుటుంబానికి రాజన్న రచ్చబండ సేవా సంకల్ప బృందం స్థానిక కొత్త బస్టాండ్ సెంటర్ వద్ద ఏడాదికి సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యం అందజేసి కూరగాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు కట్టెపోగు ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ రాజన్న రచ్చబండ సేవా సంకల్ప బృందం ఆధ్వర్యంలో 148 సేవా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి. కోటి, సుధారాణి,బి. సాంబయ్య, జాన్ బాబు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న శోభచంద్

'జగనన్న గోరుముద్ద'ను పరిశీలన

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణ నిడుబ్రోలు గ్రామంలో మున్సిపల్ పరిధిలోని మున్సిపల్ ఉన్నత పాఠశాల, మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో జగనన్న గోరుముద్దను పొన్నూరు మండల విద్యాశాఖధికారి రుద్రపాటి శోభచంద్ పరిశీలించారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. విద్యార్థులను మెను అమలు తీరును గురించి అడిగి తెలుసుకోని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పి దాసు, గోవర్ధిని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వివి.రాఘవరావు పాల్గొన్నారు.



క్రీడాకారుని ఉన్నత చదువులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి -మంగళగిరి రూరల్

మండలంలోని నిడమర్రుకు చెందిన ఖోఖో జాతీయ క్రీడాకారుడు మండేపూడి విజయ్‌కుమార్ ఉన్నత చదువులకు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డి బుధవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ఆర్థిక సహాయం అందించారు. విజయ్‌కుమార్ తండ్రి గోపయ్య మతిచెందారు. షెడ్యూల్డ్ కులానికి చెందిన విజయ్‌కుమార్ ఖోఖోలో జాతీయ క్రీడాకారుడిగా ఉత్తమ ప్రతిభాపాటవాలు ప్రదర్శిస్తున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన విజయ్‌కుమార్ ఆర్థిక ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని బెంగుళూరులో తన ఉన్నత చదువుల కోసం బ్రహ్మానందరెడ్డి తనవంతుగా ఆర్థికసాయం అందించి ప్రోత్సహించారు. క్రీడాకారుడుగానే కాకుండా ఉన్నత చదువులోనూ విజయ్‌కుమార్ రాణించాలని బ్రహ్మానందరెడ్డి ఆకాంక్షించారు.



రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

రూ.50 లక్షలతో రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

మండల పరిధిలోని మెల్లంపూడి, గుండి మెడ గ్రామాల వైపు వెళ్ళు 2.7 కిలోమీటర్ల తారు రోడ్డును బుధవారం మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్, ఆర్‌అండ్‌బి, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. సుమారు రూ. 50 లక్షల నిధులతో తారు రోడ్డును నిర్మించినట్లు అధికారులు తెలిపారు. నూతనంగా నిర్మించిన రోడ్డు ద్వారా మెల్లంపూడి, చుట్టుపక్కల గ్రామాల నుండి విజయవాడ వెళ్లే విద్యార్థులు, పంటలు పండించిన రైతులు, వివిధ పనులకు వెళ్లే కార్మికులకు నూతన రోడ్డు నిర్మించడం ద్వారా ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోయిందని రైతుల ఆనంద వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసిపి మెల్లంపూడి గ్రామ అధ్యక్షులు బి రాజారామిరెడ్డి రైతులు పాల్గొన్నారు.



పుస్తకాలు అందుకుంటున్న విద్యార్థులు

జగనన్న విద్యాజ్యోతి మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రూరల్ గ్రామం పెదరావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు బుధవారం జగనన్న విద్యాజ్యోతి స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు. గుంటూరు జల్లా పరిషత్ నుంచి పాఠశాలకు అందిన మెటీరియల్‌ను గ్రామ సర్పంచ్ కాకి రమాదేవి ముఖ్యఅతిథిగా పాల్గొని పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.ప్రభాకరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో విద్యారంగంలో పెను మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయి మౌలిక వసతుల కల్పనతో పాటు మెరుగైన విద్యాబోధన జరుగుతోందని, పరీక్ష విధానినికి అనుగుణంగా అందించిన మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ దమ్ము అనూష, విద్యార్థులు, ఉపాధాయులు పాల్గొన్నారు.

వివాలో ఫిట్ ఇండియా 4కె పరుగు

ప్రజాశక్తి - గుంటూరు



రన్‌ను ప్రారంభిస్తున్న వివా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

అజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా నంబూరులోని వివా విద్యార్థులకు 'ఫిట్ ఇండియా 4కె' క్రాస్ కంట్రీ పరుగు పోటీలు బుధవారం నిర్వహించారు. పోటీలను వివా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ జెండా ఊపి ప్రారంభించగా వివా ప్రాంగణం నుండి గోళ్లమూడి గ్రామం మీదుగా సాగిన ఈ పరుగు మార్గ మధ్యంలో ఏర్పటు చేసిన అవాంతరాలను అధిగమించి విద్యార్థులు కొనసాగించారు. చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. వ్యాయామం, పరుగును ప్రతిరోజు దినచర్యలో భాగంగా చూసుకోవాలని సూచించారు. సిబిఎస్ఈ సంధానకర్త జ్యోతి మెటల్జా, ఐబి సంధానకర్త కె.మాధవి. ఫిజికల్ డైరెక్టర్స్, ఉపాధ్యాయులు విద్యార్థులచే దృఢంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించి పరుగును నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎట్టి కమాండర్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ చదలవాడ సరళ పాల్గొన్నారు.

11న మణిపాల్ గుడ్ హెల్త్ రన్

ప్రజాశక్తి - తాడేపల్లి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిజిపి కెవి.రాజేంద్రనాథ్‌రెడ్డి తదితరులు

ఆరోగ్యానికి సంబంధించి అవగాహనా కార్యక్రమాన్ని మణిపాల్ ఆసుపత్రి చేపట్టింది. డిసెంబరు 11వ తేదీ విజయవాడ బిఆర్‌టిఎస్ రోడ్డులో (గుణదల దగ్గర) 5కె, 10కె పేరుతో మణిపాల్ గుడ్ హెల్త్ రన్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను డిజిపి కెవి.రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది కూడా మణిపాల్ హాస్పిటల్ హెల్త్‌రన్ నిర్వహించిందని, మంచి ఆదరణతో రెట్టింపు ఉత్సాహంతో రెండవసారీ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే సూక్తిని మణిపాల్ ఆసుపత్రి ఇలా అవగాహన కల్పించడం హర్షణీయమన్నారు. మణిపాల్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి మాట్లాడుతూ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కోసం ఈ రన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అత్యవసర సమయాల్లో చేయవలసిన చికిత్సలు, విధులు వారితోపాటు అవయవదానంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఆరోగ్యంతోపాటు ఫిట్‌గా ఎలా ఉండాలో ఈ రన్‌ద్వారా తెలియజేస్తామని చెప్పారు. ఖాళీ సమయాల్లో ప్రతి ఒక్కరూ రన్నింగ్ కానీ, వాకింగ్ కానీ చేయాలని సూచించారు. 16 ఏళ్లకు పైబడినవారు ఇందులో పాల్గొనవచ్చని చెప్పారు. విజేతలకు బహుమతులు కూడా ప్రదానం చేస్తామని తెలిపారు. రన్ రిజిస్ట్రేషన్‌కోసం 9618558989, 7569304232 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సమస్యల వలయంలో విద్యారంగం

- కాపాడుకోవడానికి విద్యార్థులంతా కదలాలి
- ఎస్‌ఎఫ్‌ఐ పిలుపు
- మాచర్లలో భారీ ర్యాలీ, బహిరంగ సభ
- ముగిసిన పల్నాడు జిల్లా ప్రథమ మహాసభ - నూతన కమిటీ ఎన్నిక



ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు, బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎం.కిరణ్.. నూతన కమిటీ (ఇన్‌సెట్‌లో)

ప్రజాశక్తి - మాచర్ల

సమస్యల వలయంలో ఉన్న విద్యారంగాన్ని కాపాడుకోవడానికి విద్యార్థిలోకం కదలాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.కిరణ్ అన్నారు. పట్టణంలో రెండ్రోజులుగా నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ పల్నాడు జిల్లా ప్రథమ మహాసభ ముగింపు సందర్భంగా పట్టణంలో బుధవారం విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ నుండి ప్రధాన రహదారుల మీదుగా ఎస్‌కెబిఆర్ ప్రభుత్వ కాలేజీ మైదానంలో వరకూ ప్రదర్శన సాగింది. అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కిరణ్ మాట్లాడుతూ విద్యను ప్రైవేటీకరించి గుత్తాధిపత్యం కిందకు తీసుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయని, విద్యలో మతతత్వాన్ని జొప్పించడానికి కేంద్రం వేగంగా మార్పులు తెస్తోందని విమర్శించారు. కేంద్రం చెప్పుల్లోనే రాష్ట్ర ముఖ్యమంత్రి కాళ్లు పెట్టి నడుస్తున్నారని, ఈ విధానాలు పేద విద్యార్థులకు తీవ్ర నష్టమని చెప్పారు. అందరికీ సమానంగా విద్య అందాలని ఎస్‌ఎఫ్‌ఐ ఉద్యమిస్తోందని, విద్యార్థులంతా ఐక్యంగా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఎస్‌ఎఫ్‌ఐ మాజీ నాయకులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులే నవ సమాజ నిర్మాతలని, ఉత్తమ భవిష్యత్ కోసం ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని అన్నారు. జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు కె.ఆదినారాయణ మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సంస్థల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. వెనుకబాటుతనం పోవటానికి విద్య ఒక్కటే మార్గమని ఉద్ఘాటించారు.

మండలానికో జూనియర్ కాలేజి కోసం తీర్మానం

వెనుకబడిన పల్నాడు ప్రాంతంలోని ప్రతి మండలంలో అన్ని సౌకర్యాలతో కూడిన ప్రభుత్వ జూనియర్ కాలేజీలను ఏర్పాటు చేయాలని కోరుతూ తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది. స్థానిక యాపిల్ ఐఐటి స్కూల్ ఆవరణలో రెండోరోజు ప్రతినిధుల సభలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.సాయికుమార్, రాజు మాట్లాడారు. ప్రతి మండలంలో ప్రభుత్వ జూనియర్ కాలేజి ఏర్పాటు వలన కార్పొరేట్‌కు విద్యాసంస్థలకు విద్యార్థులు తరలకుండా నిరోధించొచ్చని, స్థానికంగా ఇంటర్ విద్య అందుబాటులో ఉంటే ఇంటర్‌లో డ్రాప్ అవుట్స్ తగ్గుతాయని తెలిపారు. పేదలకు ఆర్థిక భారమూ ఉండదన్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజి, ఇంజినీరింగ్ కాలేజీలను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ విద్యా వ్యవస్థలో అన్ని స్థాయిలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి, సంక్షేమ హాస్టల్స్ మెస్ ఛార్జీలను పెంచి, మౌలిక వసతులను మెరుగుపర్చాలని, పల్నాడు జిల్లాలో మాచర్ల, నర్సరావుపేటలలో పిజి సెంటర్స్‌ను ప్రారంభించి వాటిని యూనివర్శిటీలుగా అభివృద్ధి చేయాలని, విద్యార్థినులపై దాడులు జరక్కుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

మహాసభలో ఎస్‌ఎఫ్‌ఐ పల్నాడు జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యద ర్శులుగా కోట సాయికుమార్, ఎస్.రాజు, సహా య కార్యదర్శిగా అమూల్య, ఉపాధ్యక్షులుగా కె.నవిత, రమాదేవి ఎన్నికయ్యారు. కార్యక్ర మంలో నాయకులు టి.వంశీ, అమర్‌నాథ్, రాఘవేంద్ర, వి.చైతన్య, దుర్గారావు పాల్గొన్నారు.

నూతన స్టార్టప్‌లకు వేదిక కెఎల్‌యు

వృద్ధి కేంద్రాన్ని ప్రారంభించిన నీతి ఆయోగ్ మిషన్ డైరెక్టర్ డాక్టర్ చింతన్ వైష్ణవ్

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



నూతన ఆలోచనల ఒరవడితో ఏర్పడుతున్న స్టార్టప్‌లకు కె.ఎల్. విశ్వవిద్యాలయం వేదికైందని విశ్వవిద్యాలయం అధ్యక్షులు కోనేరు సత్యన్నారాయణ అన్నారు. వర్సిటీ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన 'వృద్ధి' కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కోనేరు సత్యన్నారాయణ మాట్లాడుతూ సరికొత్త ఆలోచనలతో నూతనంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునే ఎవరైనా తమ విశ్వవిద్యాలయంలో సంప్రదించవచ్చని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన నీతి ఆయోగ్‌కు అనుసంధాన సంస్థ అయిన అటల్ కమ్యునిటీ ఇంక్‌బేటర్ సెంటర్ తమ విశ్వవిద్యాలయంలో ఉండడం దక్షిణ భారతదేశానికే గర్వకారణమన్నారు. అఖిలభారత నీతి ఆయోగ్ మిషన్ డైరెక్టర్ డాక్టర్ చింతన్ వైష్ణవ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎఐసిఐ కె.ఎల్ వృద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. నూతన స్టార్టప్‌లకు ఆంధ్రప్రదేశ్ ఎంతో అనువుగా ఉంటుందని, ఇక్కడ ఎంతో మంది యువత నూతన స్టార్టప్‌లతో ముందుకు వెళుతున్నారని అన్నారు. వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధివర్మ మాట్లాడుతూ నూతన స్టార్టప్‌ల కోసం కేంద్ర ప్రభుత్వం నిధులను కూటాయించడం సంతోషకరమన్నారు. ఉపాధ్యక్షులు కోనేరు రాజా హరీన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఏ విద్యాసంస్థకు చెందిన వారైనా స్టార్టప్ ఏర్పాటు చేయాలనుకుంటే ఈ కేంద్రం అవకాశం కల్పిస్తుందని చెప్పారు. అనంతరం ఎఐసిఐ కె.ఎల్ స్టార్టప్స్ ఫౌండేషన్ సిఇఒ గోవిల్ అలోక్ మాట్లాడారు. ఇదిలా ఉండగా వివిధ ప్రాంతాలకు చెందిన అనేకమంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తమ స్టార్టప్ ఆలోచనలను ప్రదర్శించారు. వి.సంజీవ్, మంగళేష్ యాదవ్, కోనేరు హావీష్, కాంచన లత, డాక్టర్. కె.ఎస్. జగన్నాథరావు, డాక్టర్ ఎన్.వెంకటరామ్ పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న కాలేజి చైర్మన్ కోయి సుబ్బారావు

బాస్కెట్‌బాల్ పోటీల్లో కిట్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

జెఎన్‌టియు కాకినాడ యూనివర్సిటీ ఒంగోలులో నిర్వహించిన బాస్కెట్‌బాల్ ఎంపికల్లో కిట్స్ ఇంజినీరింగ్ కాలేజి విద్యార్థులు బి.ఉమా, ఎస్‌కె.మస్తాన్ ప్రతిభ చూపించి, జెఎన్‌టియు కాకినాడ బాస్కెట్‌బాల్ టీంలోకి ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయులు కొడాలి వెంకట్రావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ కళాశాలలో చదువుతోపాటు ఆటల్లో మంచి ప్రావిణ్యం సాధించగలిగే అవకాశాన్ని విద్యార్థులకు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులను కళాశాల సెక్రెటరీ శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, డాక్టర్ కె.హరిబాబు అభినందించారు.

ఓటరు నమోదుపై అవగాహన..

కళాశాలలో ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైనదని, ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని డిప్యూటీ కలెక్టర్ ఎ.శాంతిశ్రీ, వట్టిచెరుకూరు మండలం తహశీల్దార్ నరసయ్య పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చైర్మన్ కోయి సుబ్బారావు, ప్రిన్సిపాల్, డైరెక్టర్ ప్రసంగించారు.

జాతీయస్థాయి పోటీల్లో తాడేపల్లి చిత్రకారుడి ప్రతిభ

ప్రజాశక్తి - తాడేపల్లి


గర్నెపూడి కల్యాణ్

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన క్రియేటివ్ ఆర్ట్, ఫైన్ ఆర్ట్స్ అకాడమీ కుబ్రేనికోని సప్తమ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో నిర్వహించిన నమామి వేదమాతరం ఆన్‌లైన్ కాంపిటిషన్‌లో తాడేపల్లి పట్టణం నులకపేటకు చెందిన గర్నెపూడి కళ్యాణ్ అవార్డు అందుకున్నారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుండి 250 మంది చిత్రకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అందులో పాల్గొన్న గర్నెపూడి కల్యాణ్‌కు గ్రేట్ క్రియేటివ్ ఆర్టిస్టు అవార్డుకు ఎంపికైనట్లు పోటీలు నిర్వాహక సంస్థ ప్రకటించింది. గ్రేట్ క్రియేటివ్ అవార్డు యొక్క సర్టిఫికెట్ తన ఈ మెయిల్‌కు పంపినట్లు కల్యాణ్ తెలిపారు. తాను వేసిన రాధాకృష్ణ పెయింటింగ్‌కు 77 మంది విజేతల్లో తనకు 23వ స్థానం రావడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. ప్రశంసాపత్రం కూడా ఆన్‌లైన్‌లోనే వచ్చిందని వెల్లడించారు.